నేటి కందం- నేటికి అందం

"ఒకరోజు క్రికెటు" నందున
సకలోర్వియు పులకరించి సంతస మొందన్
రకరకముల స్కోరులతో
ప్రకటింపంబడె విజయము భారతమునకున్ !!

( వన్ డే క్రికెట్ లో ఆస్ట్రేలియా పై భారత్ ఘన విజయం సాధించింది స్మృతి మందనా కు ప్రశంసలు వచ్చాయి )

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

పాశ్చాత్య సంస్కృతి
ప్రభావాల్లో యువత
ఆడ ఒప్పు ఈడ తప్పు
ఆగమయే నేడు భవిత.
చాటింగులు డేటింగులు
సహజీవన పరుగులు
చూస్తే పైన మెరుగులు
కోస్తే లోన పురుగులు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శనివారం 20-9-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :32 సంచిక:36 పేజీలు:6 వెల: రూ.1/-

## తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి: సీఎం రేవంత్‌రెడ్డి




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:తెలంగాణలో పెట్టుబడులకు ఆహ్వానం పలుకుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు మద్దతుగా నిలుస్తామని... తెలంగాణలో పెట్టే పెట్టుబడులకు భద్రత ఉంటుందని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని పిలుపునిచ్చారు. హైదరా బాద్‌లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం చేపడుతున్నామని వ్యాఖ్యానించారు. పరిపాలన చేసేందుకు రాజకీయ సంకల్పం ఎంతో అవసరమని చెప్పుకొచ్చారు. భవిష్యత్ తరాలకు అవకాశాలను సృష్టించాలనేది తమ ఆలోచన అని తెలిపారు. దేశంలో యంగెస్ట్ స్టేట్ (కొత్త రాష్ట్రం) తెలంగాణ అని ఉద్ఘాటించారు. కొత్త రాష్ట్రమైనా తెలంగాణ, హైదరాబాద్‌కు ఘనమైన చరిత్ర ఉందని నొక్కిచెప్పారు సీఎం రేవంత్‌రెడ్డి.

ఢిల్లీలో పబ్లిక్ ఎఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా 12వ వార్షిక సదస్సు ఇవాళ(శుక్రవారం) జరిగింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047 రూపొందించామని వివరించారు. తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా విభజించామని వెల్లడించారు. కోర్ అర్బన్ ఏరియాలో కోటి మంది నివసిస్తున్నారని... ఇక్కడ కాలుష్యకారక పరిశ్రమలను నగరం వెలుపలికి తరలిస్తున్నామని తెలిపారు. సెమీ అర్బన్ ఏరియాను తయారీ రంగం జోన్‌గా (మాన్యుఫాక్చర్) నిర్ణయించామని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి.

.మెట్రో పొడిగింపు...

తెలంగాణ అభివృద్ధికి తగినట్లు 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లు పొడిగించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ప్రస్తుతం అయిదు లక్షల మంది మెట్రోలో పయనిస్తున్నారని.. దానిని 15 లక్షలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పుకొచ్చారు. సబర్మతీ తీరంలా మూసీని మారుస్తామని.. అందుకు మూసీ పునరుజ్జీ వంపై దృష్టి సారించామని తెలిపారు. 2027 నాటికి హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ వాహనాలే ఎక్కువగా ఉండనున్నాయని.. అందుకే ఈవీలకు రాయితీలు ప్రకటించామని పేర్కొన్నారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

### భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం..

'రాష్ట్ర అవసరాలకు తగినట్లు రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం చేస్తున్నాం. భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. విమానాశ్రయం నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ అనుసంధానిస్తాం. తెలంగాణలో సేంద్రియ పంటలు పండుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా డ్రగ్స్ సమస్య ఉంది.. మేం తెలంగాణలో డ్రగ్స్‌ను కంట్రోల్ చేశాం. డ్రగ్స్ నిర్మూలనలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. జ్ఞానంతో పాటు నైపుణ్యం అవసరం. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

### స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు...

'మహాత్మా గాంధీ యంగ్ ఇండియా స్ఫూర్తిని అనుసరిస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చదువుకున్న వాళ్లకు ఉద్యోగాలు వస్తాయి. స్పోర్ట్స్‌లో దక్షిణ కొరియా వంటి చిన్న దేశాలకు వచ్చే మెడల్స్ చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. ఒలింపిక్స్‌లో పతకాల సాధనే లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. తెలంగాణకు భూపరివేష్టిత రాష్ట్రం (ల్యాండ్ లక్డ్) కావడంతో ఓడ రేవు లేదు. మచిలీపట్నం ఓడ రేవు అనుసంధానానికి ఫ్యూచర్ సిటీ నుంచి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే.. దానికి సమాంతరంగా రైల్వే లైన్ మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం. 2025, డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తాం. బల్క్ డ్రగ్స్ ఉత్పత్తిలో 40 శాతం తెలంగాణనే చేస్తోంది. వ్యాక్సిన్ల తయారీలో హైదరాబద్ ముందు వరుసలో ఉంది' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## సచివాలయం ఉద్యోగులు గుక్కెడు నీళ్ల కోసం పడరాని పాట్లు

హైదరాబాద్ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : తెలంగాణ సచివాలయం ఉద్యోగులను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. గుక్కెడు నీళ్ల కోసం ఉద్యోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం రక్షిత మంచినీటిని సరఫరా చేయాల్సింది పోయి.. నీటిని సరఫరా చేయలేక చేతులెత్తేసింది. చివరకు ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి వాటర్ క్యాన్స్‌ను కొనుగోలు చేస్తున్నారు ఉన్నతాధికారులు. తెలంగాణ సచివాలయంలో ఏడాది క్రితం వాటర్ ప్యూరిఫైయర్లు పాడైపోయాయి. ప్రైవేటు వ్యక్తుల నుండి వాటర్ క్యాన్స్‌ను అధికారులు కొనుగోలు చేస్తున్నారు. సచివాలయంలో వాటర్ క్యాన్స్ డబ్బుల కోసం ఉద్యోగుల నుండి నెలకు రూ. 300 నుండి రూ. 400 వరకు సెక్షన్ ఆఫీసర్లు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నుండి వస్తున్న మెయింటెనెన్స్ డబ్బులు ఏం చేస్తున్నారని ఉద్యోగులు సెక్షన్ ఆఫీసర్లను నిలదీస్తున్నారు. వాటర్ క్యాన్స్ కొనుగోలు చేస్తున్నామని ప్రభుత్వం నుండి బిల్లులు వసూలు చేస్తున్నా కూడా తమ నుండి డబ్బులు వసూలు చేయడంపై సచివాలయం ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## లోకేష్‌ను కేటీఆర్ తమ్ముడని అంటున్నారు..

### కేటీఆర్, లోకేష్ భేటీపై సీఎం రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:మాజీ మంత్రి కేటీఆర్, ఏపీ మంత్రి నారా లోకేష్ కలుసుకోవడంపై తాను కామెంట్ చేయలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వారిద్దరూ కలుకోవడం వారి వ్యక్తిగత అంశమని సీఎం తెలిపారు. లోకేష్‌ను కేటీఆర్ తమ్ముడని అంటున్నారని.. మరి చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లిన సమయంలో రోడ్లపైకి వచ్చిన వారిని ఎందుకు కొట్టారో చెప్పాలని ప్రశ్నల వర్షం కురిపించారు. చంద్రబాబును జైల్లో ఉంచినప్పుడు కేటీఆర్ ఎక్కడికి వెళ్లారని నిలదీశారు. ఇవాళ(శుక్రవారం) ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ చేశారు సీఎం రేవంత్‌రెడ్డి.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణ పర్యటనకు వచ్చిన సందర్భంలో రీజనల్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని.. ఇంతవరకూ ఎందుకు నెరవేర్చట్లేదని ప్రశ్నించారు. యూరియా కొరత కూడా రాజకీయ సృష్టే అని ఆరోపించారు. తెలంగాణలో హైడ్రా ఎందుకు తెచ్చామో రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసునని చెప్పుకొచ్చారు. కేసీఆర్, కేటీఆర్‌కి వ్యక్తిగత ప్రయోజనాలు ఉన్నాయని.. అందుకే హైడ్రాపై ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ మెట్రో బాధ్యత నుంచి ఎల్ అండ్ టీ తప్పుకుంటామని అంటోందని, అది కేసీఆర్ చేసిన తప్పిదమేనని విమర్శించారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి ఎల్ అండ్ టీ సంస్థ ఎందుకు వివరణ ఇవ్వలేదని నిలదీశారు సీఎం రేవంత్‌రెడ్డి.

హైదరాబాద్ మెట్రోలో ఐదు లక్షల మంది ప్రయాణం చేస్తున్నారని.. రానున్న ఐదేళ్లలో 15 లక్షల మంది ప్రయాణం చేసే విధంగా తాము ప్రణాళికలు రచిస్తున్నామని వివరించారు. అలాగే, పార్టీ నేతల కామెంట్లపై స్పందించారు సీఎం రేవంత్‌రెడ్డి. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువని ఉద్ఘాటించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక తయారు కావాల్సి ఉందని చెప్పుకొచ్చారు. కొందరూ నక్సలైట్లు జనజీవన స్రవంతిలో కలిశారని.. వారికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఒక పాలసీ ఉందని గుర్తుచేశారు. మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడంతో వారి సమస్య పరిష్కారం కాదని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారితో చర్చించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు సీఎం రేవంత్‌రెడ్డి.

## ప్రజలను అప్రమత్తం చేయాలి.. జాగ్రత్తలు తీసుకోవాలి

### -అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ టెలికాన్ఫరెన్స్



హైదరాబాద్ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నగరంలో కురుస్తున్న భారీ వర్షాలు.. తీసుకుంటున్న చర్యలపై జిహెచ్ఎంసి, హైడ్రా, పోలీస్, ట్రాఫిక్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్, జిల్లా రెవెన్యూ, విద్యుత్, హెల్త్ వివిధ విభాగాల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలో గత మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురుస్తుండటం వల్ల ప్రజల ఇబ్బందులు పడుతుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వచ్చే మూడు రోజుల వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు విధుల్లో ఉండాలని ఆదేశలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందుల గురించి పిర్యాదులు చేస్తే వెంటనే స్పందించాలని ఆదేశించడం జరిగింది . ప్రజలు పిర్యాదు చేసే టోల్ ఫ్రీ నెంబర్‌లను.. టీవీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలిసేలా చేయాలని కోరారు. పునరావాస కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించడం జరిగింది. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద వాహనదారులు జాగ్రత్తగా వెళ్లేలా అక్కడ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని తెలపారు. భారీ వర్షం కురిసినప్పుడు వరద నీరు పోవడానికి మ్యాన్ హోల్‌లు ఉండేలా చూసుకోవాలని.. ప్రమాదాలు జరగకుండా అక్కడ జిహెచ్ఎంసి సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. విద్యుత్ స్తంభాల, విద్యుత్ తీగల వద్ద జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ మొబైల్ మెసేజ్‌ల రూపంలో సందేశాలు పంపాలని ఆదేశించారు. తీవ్రత అధికంగా ఉన్నప్పుడు అత్యవసరం అయితేనే బయటకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని అధికారులకు సూచించి, తాగునీటి సరఫరా అయ్యే సమయంలో కచ్చితంగా మంచి నీటి నాణ్యతను పరీక్షించాలలని పేర్కొన్నారు. ఎక్కడ తాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. బస్తీలు.. లోతట్టు ప్రాంతం మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నగర ప్రజలు ఇలాంటి పరిస్థితులలో మ్యాన్ హోల్ మూతలు తెరవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. హైడ్రా, జిహెచ్ఎంసి, పోలీసు, ఇతర విభాగాల అధికారులు సమన్వయం చేసుకుంటూ పని చేయాలి అని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

## అమెరికా, భారత్ వాణిజ్య యుద్ధం నేపథ్యంలో..

## ప్రధాని మోదీపై మాత్రం ట్రంప్ తన ప్రశంసలు

లండన్ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: వాణిజ్య యుద్ధం నేపథ్యంలో అమెరికా, భారత్ మధ్య సంబంధాలు బలహీనపడ్డ విషయం తెలిసిందే. అయితే ప్రధాని మోదీపై మాత్రం ట్రంప్ తన ప్రశంసలను ఆపడం లేదు. ప్రధాని మోదీకి తాను సన్నిహితంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. సెప్టెంబర్ 17వ తేదీన మోదీ బర్త్‌డే సందర్భంగా ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్లు ట్రంప్ వెల్లడించారు. ఇండియాకు చాలా దగ్గరగా ఉన్నానని, ప్రధాని మోదీ కూడా తనకు దగ్గరి వ్యక్తే అని, ఫోన్‌లో మాట్లాడి బర్త్‌డే విషెస్ చెప్పినని, తమ మధ్య మంచి సంబంధాలు ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ ఈ విషయాన్ని చెప్పడం గమనార్హం. రష్యా వద్ద ఇంధనం కొంటున్న భారత్‌పై అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. భారతీయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను అమెరికా 50 శాతానికి పెంచడంతో రెండు దేశాల మధ్య ప్రచ్ఛన్న వాణిజ్య యుద్ధం సాగుతోంది. అయితే ద్వైపాక్షిక చర్చల ద్వారా వాణిజ్య సమస్యలను పరిష్కరించుకోనున్నట్లు చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ వీ అనంత నాగేశ్వరన్ తెలిపారు.

## అస్సాం రైఫిల్స్ వాహనంపై కాల్పులు..

### ఇద్దరు జవాన్లు మృతి, నలుగురికి గాయాలు..!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: అస్సాం రైఫిల్స్ దళాలు వెళ్తున్న వాహనంపై కొందరు దుండగులు కాల్పులకు తెగబడ్డారు. శుక్రవారం రాత్రి సాయంత్రం మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో సాయుధులైన గుర్తు తెలియని వ్యక్తులు సైనికులే లక్ష్యంగా మెరుపు దాడి చేశారు. తుపాకులతో పలు రౌండ్లు కాల్పులు జరపడంతో తీవ్రంగా గాయాల కారణంగా ఇద్దరు సైనికులు మరణించారు.

గాయపడిన మరో నలుగురిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని భారత సైన్యం తెలిపింది.

ఇంఫాల్ నుంచి బిష్ణుపూర్‌కు శుక్రవారం సాయంత్రం 407 టాటా వాహనంలో పారామిలిటరీ దళాలు వెళ్తున్నాయి. చురాచంద్‌పూర్ మార్గం సమీపంలోని నంబోల్ సబెల్ లీకాయ్ ప్రాంతంలో వీళ్ల వెహికిల్ లక్ష్యంగా గుర్తు తెలియని వ్యక్తులు జరిపారు. కాల్పులకు సంబంధించిన దృశ్యాల్లో ఒక అధికారి తీవ్రంగా గాయాలతో కనిపించాడు.

## తెలంగాణలో త్వరలో టూరిజం కాన్క్లేవ్: మంత్రి జూపల్లి



హైదరాబాద్, సెప్టెంబర్ 19:తెలంగాణలో త్వరలోనే అత్యున్నత స్థాయి టూరిజం కాన్క్లేవ్ నిర్వహిస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పెట్టుబడులే లక్ష్యంగా ఈ టూరిజం కాన్క్లేవ్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు టూరిజం శాఖ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసిందని చెప్పుకొచ్చారు. ఇవాళ(శుక్రవారం) ట్రావెల్, టూరిజం ఫెయిర్ 2025 ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు మంత్రి. ఈ సందర్భగా మీడియాతో మాట్లాడారు మంత్రి జూపల్లి కృష్ణారావు.

కొత్త పర్యాటక విధానం ఉపాధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలకు కాంక్లేవ్ దోహదం చేయనుందని తెలిపారు. టూరిజం రంగంలో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. పెట్టుబడులు పెట్టేవారికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ప్రపంచ స్థాయి పర్యాటకానికి కావాల్సిన వనరులన్నీ తెలంగాణలోనే ఉన్నాయని వివరించారు. తెలంగాణ పర్యాటకానికి తగిన స్థాయిలో ప్రచారం లభించలేదని పేర్కొన్నారు మంత్రి జూపల్లి కృష్ణారావు.

ఎగ్జిబిటర్లు, ట్రావెల్ , హాస్పిటాలిటీ రంగంలో తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బతుకమ్మ పండుగ వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. చారిత్రక వేయి స్తంభాల గుడి వద్ద బతుకమ్మ వేడుకలు ప్రారంభం అవుతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

## చెరుకుకు ప్రత్యామ్నాయంగా పరిశోధనలు చేసి షుగర్ బీట్

### -నూతన వంగడాన్ని అభివృద్ధి చేసిన ప్రొఫెసర్ కు వ్యవసాయ పరిశోధన కేంద్రం బంగారుపతకం



జహీరాబాద్ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : చెరుకుకు ప్రత్యామ్నాయంగా పరిశోధనలు చేసి షుగర్ బీట్ (చక్కెర దుంప-చాబీణజీతీ ఎవవబి ) నూతన వంగడాన్ని అభివృద్ధి చేసిన సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం బసంత్‌పూర్ ప్రొఫెసర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్ కు అరుదైన గౌరవం లభించింది. శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి పట్టణంలో సౌత్ ఇండియన్ షుగర్ కేన్ అండ్ షుగర్ టెక్నాలజిస్ట్ అసోసియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్‌ను టెక్నాలజీస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నప్పన్ ఉత్తమ బంగారు పతకం తోపాటు ప్రశంస పత్రాన్ని అందజేశారు. దక్షిణ భారతదేశంలోని పాండిచ్చేరి, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన చెరుకు శాస్త్రవేత్తలు చెరుకు పంట సాగులో నూతన వంగడాలు అభివృద్ధి చేసేందుకు చేసిన పరిశోధనలను గుర్తించి వారికి ఉత్తమ పురస్కారాలను అందజేస్తున్నారు. ఇందులో భాగంగా మన రాష్ట్రానికి చెందిన డాక్టర్ విజయకుమార్ షుగర్ బిట్ నూతన వంగడానికి బంగారు పతకాన్ని అందజేసి సత్కరించారు. బంగారు పథకం అందుకోవడం సంతోషంగా ఉందని, తనపై బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. రానున్న రోజుల్లో చెరుకు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన వంగడాలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని విజయకుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ చెందిన షుగర్ టెక్నాలజీస్ట్ అసోసియేషన్ చైర్మన్ సుజిత్ అవస్థన్, ఆయా రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేర నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలి : ఎస్పీ రోహిత్ రాజ్



ఖమ్మం, సెప్టెంబర్ 19:ప్రస్తుత కాలంలో సైబర్ మోసాలు ఎక్కువైతున్నాయని, వారి నివారణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు.

శుక్రవారం ఇల్లెందు డీఎస్పి కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఇల్లెందు డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్ డివిజన్ పరిధిలో ముఖ్యమైన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాధితులకు అండగా ఉండి పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెంచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పి చంద్రభాను, సీఐలు తాటిపాము సురేశ్, బత్తుల సత్యనారాయణ, ఎస్ఐలు సూర్యం, హసీనా, రాజేందర్, నాగుల్ మీరా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి కొండ నడిచి వెళ్లే భక్తులకు మార్గమధ్యలో దర్శనమునకు టికెట్స్ ఇవ్వాలి

### – న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్.

తిరుపతి సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); ఆంధ్రప్రదేశ్,తిరుపతి లో తిరుమలకు నడిచి వెంకటేశ్వర స్వామి దర్శనం పొందేందుకు వెళ్లే భక్తులకు మార్గమధ్యంలో దర్శనం టికెట్లు గతంలో ఇచ్చినట్లుగా ఇవ్వాలని న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ డిమాండ్ చేసారు. భక్తుల ఆందోళన తో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ తిరుపతికి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు దేశ విదేశాల నుండి మరియు భారత దేశం నుండి 29 రాష్ట్రాల నుండి భక్తులు రైలు ప్రయాణ మార్గాల ద్వారా తిరుపతికి వచ్చేసరికి సమ యం సుమారు ఉదయం 9 గంటలు పడుతుందని ఇట్టి సమయం లో తిరు మల కొండ నడిచి వెళ్లే భక్తుల కు అలిపిరి వద్ద మరియు శ్రీవారి మెట్ల మార్గం ముందు ఏర్పాటుచేసిన కౌం టర్లో దర్శనం టికెట్లు అందరికీ అను కూలంగా దొరుకుటకు అసౌకర్యంగా ఉందని తెలియజేస్తూ ఇట్టి విషయం లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకొని దృష్టి పెట్టి భక్తుల యొక్క కోరిక మేరకు గతంలో యధావిధిగా తిరుమల కొండ నడిచే మార్గమధ్యంలో ఏర్పాటుచేసిన దర్శనం టికెట్ల కౌంటర్ ను ఏర్పాటు చేసి నడిచి వెళ్లే భక్తులకు ప్రత్యేక దర్శన మార్గమును ఏర్పాటు చేసి భక్తుల యొక్క విజ్ఞప్తి చేసారు.

# ప్రపంచ ప్రజల్ని ఏకం చేసే ఓ విశ్వ భాష నాట్యం !

## (20 సెప్టెంబర్ "జాతీయ నాట్య దినోత్సవం" సందర్భంగా)

నాట్యం ఓ విశ్వ భాష. ప్రపంచ ప్రజలను ఏకం చేయగల శక్తివంతమైన సాంస్కృతిక సాధనం. నాట్యాన్ని మెచ్చని నరులుండరు. నాట్యం చేయడానికి వేదికను ఎక్కడం లేదా నాట్యాన్ని వీక్షించడానికి కళాభిమానిగా ప్రక్షకుల్లో ఉంటూ కళను ఆస్వదించడం తరుచుగా చేస్తున్నాం. ఒక మహాద్భుత అనుభూతిని, ప్రేరణను, అమితానందాన్ని అందిస్తున్నది నాట్య కళ. వివిధ ప్రాంతాల, దేశాల ప్రజలు వేరు వేరు నాట్య రూపాలను ప్రోత్సహిస్తున్నారు లేదా ప్రచారం చేస్తూ ప్రదర్శనలు ఇస్తున్నారు. నాట్య కళ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని 2010లో అమెరికాలో ప్రారంభమై ప్రతి ఏట సెప్టెంబర్ మాసంలోని మూడవ శనివారం, అనగా 20 సెప్టెంబర్ 2025 రోజున విశ్వవ్యాప్తంగా "జాతీయ నాట్య దినోత్సవం" లేదా "నేషనల్ డాన్స్ దే"ను నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 29 ఏప్రిల్ రోజున యునెస్కో ప్రతిపాదించిన "అంతర్జాతీయ నాట్య దినం" కూడా పాటిస్తున్న విషయం మనకు తెలుసు.

**నాట్యకళకు 9,000 ఏండ్ల చరిత్ర:**

స్వయం ప్రకటనకు నిలువెత్తు నిదర్శనం నాట్యం మాత్రమే. దాదాపు 9,000 ఏండ్ల క్రితమే ప్రారంభమైన నృత్య కళ నేడు అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రజల మన్నులు పొందుతున్నది. సాంస్కృతిక సరిహద్దులు చెరుపుతూ విశ్వవ్యాప్తం కావడం, వైవిధ్యభరితమైన మానవాళిని ఒకే వేదికపైకి తీసుకురావడం, కళాభిమానులకు మానసిక ప్రశాంతతను చేకూర్చడం లాంటి పలు ప్రయోజనాలు కలిగిన నాట్యకళ ఆనందాలు పంచుతూ దేహం, మనసు, హృదయం, ఆత్మలకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. నాట్యం ద్వారా వ్యక్తిగత అభినయం, శరీర భాగాల సమన్వయం, భావోద్వేగాలను ఆకర్షణీయంగా వ్యక్తీకరించడం, మానసిక ఒత్తిడిని తగ్గించడం జరుగుతుంది. నాట్యం చేయడం వల్ల మానసిక వికాసంతో పాటు కండరాలు బలపడడం, శరీర బరువు నియంత్రణ, శరీర కదలికలు, ఎముకల పటుత్వం, శరీర సమతుల్యత పెరగడం, హృదయనాళ ఆరోగ్యం, సామాజిక గుర్తింపు, మానసిక సంతోషం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి.

**భారతంలో వైవిధ్యభరిత నాట్యకళ:**

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్న సువిశాల భారతంలో ఎన్నో శాస్త్రీయ, జానపద నాట్యాలు ప్రజాదరణను పొందాయి. భారత సంగీత అకాడమీ గుర్తించిన ఎనిమిది శాస్త్రీయ నృత్య కళల్లో భరతనాట్యం, కూచిపూడి, కథకుల, కథక్, ఒడిసి, మోహినీయాట్టం, మణిపురి, సత్రియాలు వస్తాయి. భారత దేశవ్యాప్తంగా 29 జానపద నాట్య కళారూపాలను గుర్తించినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో బహుళ ప్రచారం పొందిన జానపద నాట్యాల్లో విలాసిని, భామాకలాపం, వీర నాట్యం, డప్పు, తప్పెటగుళ్లు, లంబాడి, ధింసా, కోలాటం, పేరిణి, బుర్ర కథ, గుస్సాడి, చిందుల బాగోతం, బుట్ట బొమ్మలు, బోనాలు లాంటివి ఉన్నాయి.

డిజిటల్ యుగంలో నాట్య కళను సజీవంగా కొనసాగించడానికి ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థలు, స్వచ్ఛంద సంస్థలు చొరవను చూపాలి. నాట్యకళను యువతలో ప్రోత్సహించాలి. నాట్య కళాకారులను తగు రీతిలో గుర్తించడం, చిన్నారులకు నాట్య శిక్షణ ఇప్పించడం, నాట్య కళాశాలలను ఏర్పాటు చేయడం, నాట్య శిక్షణ ఇచ్చే గురువులను ప్రోత్సహించడం, నాట్య కళ పట్ల సమాజంలో చిన్న చూపును రూపుమాపడం లాంటి చర్యలు సత్వరమే తీసుకొని మన నాట్యకళా వారసత్వ సంపదను రాబోయే తరానికి అందించే ప్రయత్నాలు జరగాలి. నాట్య కళ ఆయా దేశాల లేదా ప్రాంతాల సాంస్కృతిక వారసత్వాలను ప్రపంచానికి చాటుతుంది. నేడే మన పిల్లలు, బంధువులు, స్నేహితులను డ్యాన్స్ తరగతుల్లో చేర్పిద్దాం. మనం నాట్యం నేర్చుకోలేక పోయినా, నాట్య కళను మాత్రం ప్రోత్సహిద్దాం.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# భూఉష్ణ శక్తి సాంకేతికత దిశగా జాతీయ విధానాన్ని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:2070 నాటికి నికర సున్నా ఉద్గారాలను సాధించాలన్న భారతదేశ ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని చేరుకోవడం, వైవిధ్యభరితమైన పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయాలన్న నిబద్ధతకు అనుగుణంగా జాతీయ భూఉష్ణ శక్తి విధానాన్ని (2025) ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.

భూఉష్ణ శక్తి స్వచ్ఛమైనదే కాకుండా విశ్వసనీయమైనది. భారతదేశం ఇప్పటి వరకూ వినియోగంలో లేని భూఉష్ణ వనరులను.. విద్యుత్పుత్తితో పాటుగా సామూహిక తాపనం (డిస్ట్రిక్ట్ హీటింగ్), వ్యవసాయం, ఆక్వాకల్చర్, భూ ఆధారిత ఉష్ణ పంపుల సాంకేతికత (జీఎస్‌హెచ్‌పీ- గ్రౌండ్ సోర్స్ హీట్ పంప్స్) ద్వారా గదులను చల్లబరచటం- వేడిగా చేయటం వంటి ప్రత్యక్ష ప్రయోజనాలకు ఉపయోగించనుంది. కొత్తగా ప్రకటించిన ఈ విధానం.. దేశంలో భూఉష్ణ శక్తి అన్వేషణ, అభివృద్ధి, వినియోగాన్ని ప్రోత్సహించడానికి సమగ్ర విధివిధానాలను అందిస్తోంది.

జాతీయ విధానంలోని ముఖ్యాంశాలు

పరిశోధన, ఉత్తమ పద్ధతులు: భూఉష్ణ శక్తి అభివృద్ధి విషయంలో పరిశోధన, మంత్రిత్వ శాఖల మధ్య సహకారం, ప్రపంచ ఉత్తమ పద్ధతులను అవలంబించటాన్ని ప్రోత్సహిస్తుంది. భూఉష్ణ శక్తి విషయంలో నియంత్రణ, పర్యవేక్షణ బాధ్యతలను మంత్రిత్వ శాఖనే నిర్వహించనుంది.

జాతీయ లక్ష్యాలతో ఏకీకరణ: పునరుత్పాదక ఇంధన లక్ష్యాలతో పాటు 2070 సంవత్సరం వరకు నికర సున్నా ఉద్గారాలను సాధించాలన్న భారతదేశ లక్ష్యంతో భూఉష్ణ శక్తిని ఏకీకృతం చేయాలని ఈ విధానం లక్ష్యంగా పెట్టుకుంది.

విభిన్న అనువర్తనాలు: విద్యుత్పత్తి, గదులను వేడి చేయటం లేదా చల్లబరచటం, వ్యవసాయం (గ్రీన్‌హౌస్‌లు, శీతలీకరణ కేంద్రాలు), పర్యాటకం, ఉప్పు నీటిని మంచి నీటిగా మార్చటంపై (డీశాలినేషన్) దృష్టి సారించనుంది.

సాంకేతిక ఆవిష్కరణ: భూ ఉష్ణం- సౌర విద్యుత్‌తో కూడిన హైబ్రిడ్ కేంద్రాలు, వాడుకలో లేని చమురు బావులను తిరిగి ఉపయోగించేందుకు సిద్ధం చేయటం, మెరుగైన లేదా అధునాతన భూఉష్ణ వ్యవస్థలు (ఈజీఎస్ లేదా ఏజీఎస్) వంటి అత్యాధునిక సాంకేతికతలపై పరిశోధన- అభివృద్ధిని ఇది ప్రోత్సహిస్తుంది.

స్థానిక ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు: స్థానిక ఆవిష్కరణలు, జాయింట్ వెంచర్లు, ఇప్పటికే ఉన్న చమురు- గ్యాస్ మౌలిక సదుపాయాల పునర్నిర్మాణానికి ఇది ప్రాధాన్యతనిస్తుంది.

భాగస్వామ్యాలు: భూఉష్ణానికి సంబంధించిన అంతర్జాతీయ సంస్థలు, ఈ రంగంలో మార్గదర్శక స్థాయిలో ఉన్న దేశాలతో భాగస్వామ్యాలు ఏర్పరచుకోవటం.. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు, చమురు- గ్యాస్ కంపెనీలు, పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేయటం.

భూఉష్ణ రంగ వ్యవస్థను అభివృద్ధి చేయటం: భూఉష్ణ రంగ దీర్ఘకాలిక అభివృద్ధి కోసం బలమైన ప్రభుత్వ- ప్రైవేట్ వ్యవస్థను తయారుచేయటం.

సామర్థ్య నిర్మాణం: ఈ రంగంలో విజ్ఞానానికి సంబంధించిన భాగస్వామ్యం, మానవ వనరుల అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

భూఉష్ణ శక్తి అన్వేషణలో మొదటి మెట్టుగా మంత్రిత్వ శాఖ దీనికి సంబంధించిన అయిదు ప్రాజెక్టులను మంజూరు చేసింది. దేశంలో భూఉష్ణ శక్తి సాధ్యాసాధ్యాలతో పాటు సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు ఉద్దేశించిన పైలట్ ప్రాజెక్టులతో పాటు వనరులను అంచనా వేసే ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి.

ఈ ప్రాజెక్టుల పురోగతిని నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ) సమీక్షిస్తుంది. ప్రాజెక్టులను చేపట్టే సంస్థలతో పాటు పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు భారతదేశ స్వచ్ఛ ఇంధన పరివర్తనలో చురుకుగా పాల్గొనడానికి అనుకూలమైన వాతావరణం ఉండేలా చూసుకోవటాన్ని కొనసాగిస్తుంది.

# సురేంద్రబాబుకు చైర్మన్ పగ్గాలు..

అమరావతి, సెప్టెంబర్ 19: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్ గా వి. సురేంద్రబాబు (మణి నాయుడు)ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. గతంలో కూడా పాలకమండలి చైర్మన్ గా అనుభవం ఉంది.

పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తూ పార్టీలో పెద్దలను చిన్న నాయకులను అందరిని సమన్వాయం చేసే పెద్ద మనస్తత్వం ఉన్న వ్యక్తిగా మరోసారి గుర్తించి పదవికి నియమించారు. వి. సురేంద్రబాబు మాట్లాడుతూ..తనను కాణిపాకం ఆలయ చైర్మన్ గా నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ బాబుకి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి, పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళి మోహన్ కి, నాకు ఈ పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు పెద్దపేట వేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# సేవా పర్వ్ వేడుకల్లో భాగంగా డీడీ నేషనల్, డీడీ న్యూస్ ఛానళ్లలో ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:సేవా పర్వ్ వేడుకల్లో భాగంగా కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈ రోజు ఢిల్లీలో డీడీ నేషనల్, డీడీ న్యూస్ ఛానళ్లలో ప్రత్యేక కార్యక్రమాలను ఆవిష్కరించారు. డాక్యుమెంటరీలకు చెందిన ప్రోమోలను కూడా ఆయన విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దూరదర్శన్, ప్రసార భారతి విడుదల చేసిన డాక్యుమెంటరీలు ప్రధానమంత్రి మోదీ స్ఫూర్తినీ, జీవితకాలంలో చూపిన అంకితభావాన్ని తెలియజేస్తాయని అన్నారు. ప్రధానమంత్రి మొదటి నుంచి దేశానికీ, సమాజానికీ సేవ చేసేందుకు పూర్తిగా అంకితమయ్యారని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి జాతి నిర్మాణమనే లక్ష్యం కోసం మోదీ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని వ్యాఖ్యానించిన మంత్రి.. ఈ నిబద్ధత దేశానికి గొప్ప వరం అని అన్నారు. నేడు దేశవ్యాప్తంగా కనిపిస్తున్న కీలక మార్పులను ఈ సందర్భంగా మంత్రి తెలియజేశారు.

గత 11 సంవత్సరాల్లో దేశంలోని మారుమూల గ్రామాలు కూడా స్పష్టమైన పురోగతిని సాధించాయని మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ అన్నారు. గతంలో అనేక దశాబ్దాలు పట్టిన ఈ అభివృద్ధి ఇప్పుడు కేవలం ఒక దశాబ్దంలోనే సాధించినట్లు తెలిపారు. సాంకేతికత, సృజనాత్మకత, సామాజిక న్యాయం, సమ్మిళిత వృద్ధి వంటి రంగాల్లో భారత్ ప్రపంచవ్యాప్తంగా నూతన గుర్తింపును పొందుతోందన్నారు. సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని ప్రోత్సహించే సేవా పర్వ్ సందర్భంగా.. సేవా స్ఫూర్తిని వేడుకగా జరుపుకోవాలని సూచించారు. రక్తదానంతో ఈ రోజును ప్రారంభించినట్లు ఆయన తెలియజేశారు.

ప్రధానమంత్రి మోదీ దార్శనిక నాయకత్వంలో దేశంలో కొనసాగుతోన్న పరివర్తన ప్రయాణాన్ని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు ప్రస్తావించారు. మోదీ పాలనలో ప్రజాసేవ, సుపరిపాలన అనేవి మార్గదర్శక సూత్రాలుగా ఉన్నాయన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల పురోగతినీ, అభివృద్ధిని తెలిపే కథనాలు వెలువడుతున్నాయన్న ఆయన.. 2047 నాటికి అభివృద్ధి చెందే దిశగా భారత్ చేస్తున్న ప్రయాణంలో సాధించిన గణనీయమైన పురోగతిని ఈ కార్యక్రమం తెలియజేస్తోందని చెప్పారు.

సేవా పర్వ్ సందర్భంగా నిర్వహిస్తోన్న ప్రత్యేక కార్యక్రమాలు సేవా స్ఫూర్తిని తెలియజేస్తాయి. విభిన్న కార్యక్రమాల ద్వారా జాతి నిర్మాణం కోసం కృషి చేసిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిబద్ధతను ఇవి ప్రముఖంగా తెరపై ప్రదర్శిస్తాయి. దూరదర్శన్‌లో వచ్చే ప్రత్యేక కార్యక్రమాలు ప్రజా సేవ, అభివృద్ధి, సామూహిక బాధ్యతకు సంబంధించిన స్ఫూర్తిదాయకమైన కథనాలను అందిస్తాయి. డీడీ న్యూస్ జాతీయ స్థాయిలో మూడు డాక్యుమెం టరీలతో పాటు.. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశంలో గ్రామాలు సాధించిన అభివృద్ధి, పరివర్తన కథనాలను తెలియజేసే 'మేరా గావ్ ఆజ్' అనే సిరీస్‌ను ప్రసారం చేయనుంది. డీడీ నేషనల్ 'స్వ సే సమగ్ర తక్' అనే డాక్యుమెంటరీని ప్రసారం చేస్తుంది. డీడీ న్యూస్ ప్రాంతీయ ఛానళ్లలో ఆయా భాషలలో కూడా ఈ డాక్యుమెంటరీలు ప్రసారం కానున్నాయి.

పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ శ్రీ ధీరేంద్ర ఓజా, ప్రసార భారతి చైర్మన్ శ్రీ నవనీత్ కుమార్ సెహగల్, ప్రసార భారతి సీఈఓ శ్రీ గౌరవ్ ద్వివేది, ప్రఖ్యాత చిత్రనిర్మాత – కథన రచయిన డాక్టర్ చంద్రప్రకాష్ ద్వివేది, సమాచార- ప్రసార మంత్రిత్వ శాఖ మీడియా విభాగాల సీనియర్ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆవిష్కరించిన డాక్యుమెంటరీలు, సిరీస్‌లు:

సంకల్ప్ కి శక్తి, సుశాసన్ కా సామర్థ్య: గత 11 సంవత్సరాలలో ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో భారత్ గణనీయమైన పురోగతిని సాధించింది. ఆయన పరిపాలన ప్రజలకు సాధికారత కల్పించి, వారిని అభివృద్ధికి కేంద్ర బిందువుగా చేసింది. ప్రజల సమగ్రాభివృద్ధికి.. ముఖ్యంగా పేదలు, రైతులు, మహిళలు, యువత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం "సంస్కరణ, పనితీరు, పరివర్తన" అనే సూత్రాన్ని అనుసరిస్తోంది. సామాజిక న్యాయాన్ని అందించటం కోసం విద్య, ఆరోగ్యంతో సహా అనేక అంశాల్లో వివిధ కార్యక్రమాల ద్వారా అర్హులైన వారందరికి లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో సమగ్ర విధానాన్ని పాటిస్తోంది. ఈ సమగ్ర విధానాన్ని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తయారవ్వాలన్న భారత్ ఆకాంక్షను ఈ డాక్యుమెంటరీ అద్దం పడుతుంది.

విశ్వ పాటల్ పర్ నేతృత్వ కా శంఖ్‌నాద్: గత 11 సంవత్సరాలుగా ప్రధాన మంత్రి మోదీ ప్రపంచ నాయకుడిగా ఎదిగారు. ఆయన గ్లోబల్ సౌత్‌కు మద్దతునివ్వటంతో పాటు వాతావరణ మార్పు గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ శాంతి కోసం నిరంతరం తన వాదనను వినిపిస్తున్నారు. అంతర్జాతీయ సౌర కూటమి, విపత్తు నిరోధక మౌలిక సదుపాయాల కూటమితో సహా అనేక ప్రపంచ స్థాయి కార్యక్రమాలను భారత్ ప్రారంభించింది. జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా నిర్వహించుకోవడం ప్రధాని మోదీ ప్రపంచ నాయకత్వాన్ని మరింత ప్రముఖంగా తెలియజేస్తోంది. ఆయన దార్శనికత ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన తీరును ఈ డాక్యుమెంటరీ తెలియజేస్తుంది.

కర్మయోగ్ – ఏక్ అంతీన్ యాత్ర: భారతదేశ పరివర్తన ప్రయాణంలో భాగమైన ప్రధానమంత్రి మోదీ నిరంతర కృషి, నిబద్ధత, చిత్తశుద్ధిని తెలియజేసే డాక్యుమెంటరీ ఇది. గత 11 సంవత్సరాలుగా అంతరిక్షం, అంకురాలు, సౌరశక్తి, మహిళా సాధికారత, సాంస్కృతిక పునరుజ్జీవనం, ఆధ్యాత్మికత, మరెన్నో రంగాల్లో సాధించిన విజయాలను ఇది తెలియజేస్తుంది. భారతదేశ వృద్ధి పట్ల ప్రధాని దార్శనికతను ప్రముఖంగా తెలియజేసేందుకు.. ఆయన ఇంటర్వ్యూలలో చేసిన వ్యాఖ్యలను ఇందులో పొందుపరిచారు. జాతీయాభివృద్ధి పట్ల ఆయన చేస్తోన్న అవిశ్రాంత కృషిని ఇవి తెలియజేస్తాయి.

స్వా సే సమగ్ర తక్: కంగనా రనౌత్ సమర్పణలో డాక్టర్ చంద్రప్రకాష్ ద్వివేది దర్శకత్వం వహించిన ఈ రెండు భాగాల ప్రత్యేక సిరీస్ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్ఫూర్తిదాయక జీవిత ప్రయాణాన్ని తెలియజేస్తుంది. వాద్నగర్ సందుల నుంచి చారిత్రాత్మక ఎర్రకోట వరకు ఎదిగిన మోదీ కథను ఇది తెరపై ప్రదర్శించనుంది. ప్రగతిశీల నాయకత్వం ద్వారా దేశ నిర్మాణం కోసం స్ఫూర్తిదాయకమైన ప్రయాణాన్ని చేపట్టిన ఒక దార్శనిక నాయకుడి కథ ఇది.

ప్రాంతీయ స్థాయి డాక్యుమెంటరీలు: గత 11 సంవత్సరాల్లో ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో రాష్ట్ర స్థాయిలో సాధించిన ఆర్థిక, సామాజిక పురోగతిని తెలియజేసే అనేక ప్రాంతీయ డాక్యుమెంటరీలు డీడీ న్యూస్‌కు చెందిన సంబంధిత ప్రాంతీయ ఛానళ్లలో ప్రసారంకానున్నాయి.

మేరా గావ్ ఆజ్: గత 11 సంవత్సరాలుగా దేశంలోని గ్రామాల్లో వచ్చిన మార్పులను ఇది తెలియజేస్తుంది. 75 గ్రామాలకు సంబంధించిన క్షేత్రస్థాయి నివేదిక ఈ సిరీస్‌లో ఉంది. ఆయా సర్పంచ్‌లు, గ్రామాధికారులు, మార్పునకు ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న స్థానికులు పురోగతిని వివరిస్తారు. అనుసంధానత, అవకాశాలు, అభివృద్ధిని కళ్ల ముందుంచటం ద్వారా దేశంలోని గ్రామాలు గతంలో కంటే వేగంగా ఎలా మార్పు చెందుతున్నాయన్నది ఇది తెలియజేస్తుంది.

# పట్టుబడిన రూ.35లక్షల బంగారం




అమరావతి, సెప్టెంబర్ 19: నకిలీ నోట్ల తయారీ, చెలామణీ చేస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర చైన్ స్నాచర్లను పుట్లూరు పోలీసులు, సీసీఎస్ సిబ్బంది కలిసి పట్టుకున్నారు. తాజాగా 12 కేసులు ఛేదించారు. రూ. 35 లక్షల 304 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 35,500 వేల నగదు, నకిలీ 500 నోట్లు ప్రింటర్, 2 బైకులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం అనంతపురం పోలీస్ కాన్ఫరెన్స్ హాలు (ఒనిజీనిబిజీజూబీటీ ఖనీశ్రీతిఇవ అనీనిటవవీవనిఇవ ఊజీశ్రీశ్రీ) లో నిర్వహించిన మీడియా సమావేశంలో అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ (ాఖ ఖ. ఏజీణజీటతిబష్ట) ఈ కేసుల వివరాలను తెలిపారు. అనంతపురం జిల్లా కంబదూరు మండల కేంద్రం, పాత ఎస్.సి కాలనీకి చెందిన ఎం.జశ్వంత్ అలియాస్ జస్వంత్ అలియాస్ రాజు అలియాస్ గుండు (25), కంబదూరు మండల కేంద్రం చెక్ పోస్ట్ సమీపంలోని ఆర్డీటీ కాలనీకి చెందిన కంబదూరు భోగం రాజు అలియాస్ షాలేము రాజు అలియాస్ షాలెమ్ (21) మంచి స్నేహితులు. క్రికెట్ బెట్టింగ్, పేకాట, తదితర వ్యసనాలకు అలవాటుపడి అప్పులు చేశారు. ఈ అప్పులు తీర్చడానికి, వ్యసనాలకు సులువుగా డబ్బులు సంపాదించాలని భావించారు. చైన్ స్నాచింగులు నకిలీ నోట్ల తయారీ, చలామణి కి వ్యూహరచన చేసుకున్నారు.

ఈ ఇద్దరు జంటగా శివారు ప్రాంతాలు, జన సంచారం లేని ప్రదేశాలలో మహిళలను టార్గెట్ చేసి చైన్ స్నాచింగుల (అప్రజీతిని బనిజీబిఇష్ట్రతినిణ) కు పాల్పడ్డారు. ఈ ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెళ్లి అనంతపురం, పుట్లూరు, నార్పల, ఉరవకొండ, తాడిపత్రి పట్టణం చుట్టుప్రక్కల గ్రామాలు, కడప జిల్లా సింహాద్రిపురం మండలం తదితర ప్రాంతాల్లో చైన్ స్నాచింగులకు పాల్పడ్డారు. గత రెండేళ్లలో వీరిద్దరూ 12 చైన్ స్నాచింగులకు పాల్పడ్డారు. అనంతపురం నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ -1, నార్పల-2, ఉరవకొండ-1, తాడిపత్రి-3, తాడిపత్రి రూరల్ ? 1, అనంతపురం రూరల్ - 1, పుట్లూరు-2, కడప జిల్లా సింహాద్రి పురం పోలీసు స్టేషన్ పరిధిలో ఒకటి ? మొత్తం 12 చైన్ స్నాచింగులు చేయగా ఈ మొత్తం కేసుల్లో పోలీసులు రికవరీ చూపారు

దొంగనోట్ల తయారీ చేసి చెలామణి చేసేందుకు పన్నాగం పన్నారు. కలర్ ప్రింటర్ ద్వారా నకిలీ నోట్లు తయారీలో నిమగ్నమయ్యారు. లాంగ్ నోట్ బుక్ లలోని వైట్ పేపర్లు తీసుకుని వాటిల్లో ఒరిజినల్ కరెన్సీ నోట్లను జిరాక్స్ చేసి చెలామణి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దొంగనోట్ల తయారీ చెలామణి గుట్టు ఆదిలోని రట్టయ్యింది.

జశ్వంత్ పాతనేరస్థుడు. ఇతనిపై ఇదివరకే ఆరు కేసులు ఉన్నాయి. గత నాలుగేళ్లుగా కర్నాటక రాష్ట్రం పావగడ, అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం, కంబదూరు ప్రాంతాలలో వాహనాల చోరీ, ఇంట్లో దొంగతనాలు, దోపిడీ. చైన్ స్నాచింగ్ లు చేశాడు. 2021లో కర్నాటక రాష్ట్రం పావగడలో -2 , వైఎన్ హ్యాసకోటలో ఒకటి, 2023 లో జిల్లాలోని కళ్యాణదుర్గంలో ఒకటి? 2024 లో కంబదూరు పోలీసు స్టేషన్లో 2 కేసులు ఇతనిపై నమోదయ్యాయి.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో చైన్ స్నాచర్లపై పోలీసులు (ఖనీశ్రీతిఇవ) ప్రత్యేక నిఘా వేశారు. పుట్లూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.సత్యబాబు, అనంతపురం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (అ.అ.ా) ఇన్స్పెక్టర్లు శేషగిరి, జయపాల్ రెడ్డి, వలి బాషు, ాఎ రాజశేఖర్ రెడ్డి, అఊ సిబ్బంది హెడ్ కానిస్టేబుళ్లు మల్లికార్జున, చంద్ర శేఖర్, తిరుమలేశు, శ్రీధర్ ఫణి, వెంగప్ప, మక్బుల్, కిరణ్, రఘునాథ రెడ్డి, వేణుగోపాల్, భాస్కర్, మధు కానిస్టేబుల్స్ రంజిత్ కుమార్, బాలకృష్ణ, జయరామ్, ఆసిఫ్, దాస్ పుట్లూరు పోలీసు స్టేషన్ సిబ్బంది యాఎ. టీఎస్ .అనీష్ బాషు, హెడ్ కానిస్టేబుల్స్ నూరుళ్ళ, అబ్దుల్ రహిమాన్ , పోలీసు కానిస్టేబుల్స్ రమేశ్, నరేశ్ కుమార్, శివశంకర్, అల్తాఫ్ లు ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు. పుట్లూరు మండలం శెనగల గూడూరు గ్రామ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద వీరిద్దరినీ పట్టుకున్నారు. ఈ పోలీసు బృందాలకు రివార్డ్ లు ఇచ్చి జిల్లా ఎస్పీ పి. జగదీష్ అభినందించారు.

# అనంతలో ఈవ్ టీజర్ గోల

## -అరదండాలతో జైలుకు తరలింపు

అమరావతి, సెప్టెంబర్ 19:లేడీ డాక్టరమ్మకు ఈవ్ టీజింగ్ తప్పలేదు. తనను ప్రేమించాలని వేధిస్తున్న రోమియోను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురం టూ టౌన్ సీఐ యాదవ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్ కు చెందిన గిద్దలూరి మోహన్ సాయి (27) ఎస్ ఎస్ బీ ఎన్ కాలేజీ లో బీకామ్ చదివాడు. ప్రస్తుతం పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు.

ఈ నెల 13న అనారోగ్యంగా ఉందని, తనకు దగ్గు వస్తోందని మోహన్ సాయి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. లో ఎమర్జెన్సీ వార్డు లో హౌస్ సర్జన్ గా పని చేస్తున్న ఓ లేడీ డాక్టర్ పై కన్నువేశాడు. తనను ప్రేమించాలని వెంటపడి వేధిస్తున్నాడు. ఆసుపత్రి సూపరింటెండ్ డాక్టర్ కెఎల్ సుబ్రమణ్యం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఈవ్ టీజర్ ను గుర్తించి శుక్రవారం (20.09.25) ఉదయం అరెస్ట్ చేసి రిమాండు కు తరలించారు.

# "నగరం లోపల నగరం"గా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 19:హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కేవలం వ్యాపార కేంద్రంగా మాత్రమే కాకుండా నగరం లోపల నగరం గా వేగంగా రూపాంతరం చెందుతోంది. పని, ఇల్లు, విద్య, ఆరోగ్య సంరక్షణ, జీవనశైలి సజావుగా కలిసి ఉండే చక్కటి పర్యావరణ వ్యవస్థగా ఇది అభివృద్ధి చెందుతోంది. యాఃఒ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ దార్శనికతను పునరుద్ఘాటించారు. భారతదేశంలో అత్యంత స్థిరమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న రియల్ ఎస్టేట్ మార్కెట్లలో ఒకటిగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఎందుకు మారిందో డేటాతో సహా ఇక్కడ వెల్లడించారు.

గత నాలుగు సంవత్సరాలుగా, ఈ ప్రాంతంలో అద్దెల పెరుగుదల స్థిరంగా నగర నగటును అధిగమించింది, ఇది నిజమైన డిమాండ్‌ను నొక్కి చెబుతుంది. 2024?25 ఆర్థిక సంవత్సరంలోనే, 3ఃఊఒ అద్దెలు 25.7% పెరిగాయి, హైదరాబాద్ సాధారణ 2?3% రాబడితో పోలిస్తే. అనేక గేటెడ్ కమ్యూనిటీలలో రాబడి 4-6%కి పెరిగింది. ముఖ్యంగా, ఈ డిమాండ్ ఊహాజనితమైనది కాదు, ఇది గ్లోబల్ కార్పొరేషన్లు, జిసిసిలలో పనిచేసే మధ్య స్థాయి నుండి సీనియర్ స్థాయి నిపుణుల నేతృత్వంలోని అంతిమ వినియోగదారుల అనుభవ ఆధారితమైనది.

ఈ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, భారీ కంపెనీల నుండి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తూనే ఉంది. మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఆపిల్, టిసిఎస్, క్వాల్కమ్ వంటి కంపెనీల విస్తరణలతో పాటు 26,000 మందికి ఉపాధి కల్పించనున్న గూగుల్ 3.3 మిలియన్ చదరపు అడుగుల క్యాంపస్ కార్పొరేట్ విశ్వాస స్థాయిని నొక్కి చెబుతుంది. 2025 మొదటి అర్ధభాగంలో, భారతదేశం మొత్తం టెక్ లీజింగ్‌లో హైదరాబాద్ 21% వాటాను కలిగి ఉంది, వీటిలో ఎక్కువ భాగం ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కేంద్రీకృతమై ఉన్నాయి.

రాబోయే రెండు నుండి మూడు సంవత్సరాలలో 90,000?100,000 కొత్త ఉద్యోగాలు ఇక్కడకు రానున్నాయని అంచనా వేయబడుతున్నందున, గృహ డిమాండ్ బేస్ మరింత పెరగనుంది. మెట్రో ఫేజ్ ఎఎ వంటి మౌలిక సదుపాయాల నవీకరణలు, విమానాశ్రయానికి మెరుగైన ఓఆర్ఆర్ కనెక్టివిటీ, అంతర్జాతీయ పాఠశాలలు, మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు, క్యూరేటెడ్ రిటైల్, విశ్రాంతి కేంద్రాలు, బలమైన సామాజిక మౌలిక సదుపాయాలు వంటి వాటి ద్వారా ఈ వృద్ధికి మద్దతు లభిస్తుంది.

ఈ అంశాలపై యాఃఒ వ్యవస్థాపకులు అండ్ సీఈఓ అజితేష్ కొరుపోలు మాట్లాడుతూ "కేవలం ఆఫీస్ కారిడార్ అనే పరిమితిని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ దాటింది. ఇది ఇప్పుడు హైదరాబాద్ అత్యున్నత స్థాయి పూర్తి పట్టణ పర్యావరణ వ్యవస్థ నగరంలోపల అసలైన నగరం. ఉద్యోగాలు, మౌలిక సదుపాయాలు, జీవనశైలి సమ్మేళనంతో, ఇక్కడ అవకాశం స్వల్పకాలిక ఊహాగానం కాదు, దీర్ఘకాలిక నిర్మాణ విలువ. నివాసితులు, పెట్టుబడిదారులు ఇద్దరికీ, ఇక్కడే హైదరాబాద్ భవిష్యత్తు వ్రాయబడుతోంది.." అని అన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి సమగ్ర, డిజైన్- ఆధారిత పర్యావరణ వ్యవస్థలు భారతదేశంలో పట్టణ వృద్ధి తదుపరి దశను ఎలా నిర్వచిస్తాయో నొక్కిచెప్పే ఇంటరాక్టివ్ మీడియా సెషన్‌తో కార్యక్రమం ముగిసింది.

# భారతదేశ హరిత ఇంధన పరివర్తనను వేగవంతం చేసేందుకు పునరుత్పాదక విద్యుత్‌కు సంబంధించిన పరికరాలపై 5 శాతానికి తగ్గిన జీఎస్టీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:త్వరలో అమల్లోకి రాబోతున్న జీఎస్టీ సంస్కరణలు పునరుత్పాదక ఇంధన రంగాన్ని భారీగా ప్రోత్సహించనున్నాయి. ఆర్థిక వ్యవస్థలోని ప్రతి రంగాన్ని బలోపేతం చేసే విధంగా జీఎస్టీని 'వాస్తవంగా మంచి, సరళమైన పన్ను'గా మార్చాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా 2025 సెప్టెంబర్ 3న జరిగిన 56వ సమావేశంలో జీఎస్టీ మండలి పలు సంస్కరణలను ఆమోదించింది.

పునరుత్పాదక శక్తి వాణిజ్య కార్యకలాపాలన్నింటికీ జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించటం వల్ల హరిత ఇంధన ప్రాజెక్టుల విషయంలో వ్యయం తగ్గనుంది. ఇది విద్యుత్తును మరింత అందుబాటు ధరల్లోకి తీసుకొచ్చి.. గృహాలు, రైతులు, పరిశ్రమలు, ప్రాజెక్టులు చేపట్టే సంస్థలకు ప్రత్యక్ష ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. గ్రిడ్‌లకు విద్యుత్ సరఫరా చేసే ప్రాజెక్టులను ఉదాహరణగా తీసుకుంటే.. వాటి మూలధన వ్యయం సాధారణంగా మెగావాట్‌కు రూ. 3.5 నుంచి 4 కోట్ల వరకు ఉంటుంది. జీఎస్టీ తగ్గటం వల్ల ఇప్పుడు ఒక్క మెగావాట్‌కు రూ. 20 నుంచి 25 లక్షల ఆదా అవుతుంది. 500 మెగావాట్ల స్థాయి సౌర విద్యుత్ కేంద్రం అయితే ఈ ఆదా రూ. 100 కోట్లకు వరకు ఉంటుంది. ఇది విద్యుత్ ఛార్జీల విషయంలో పోటీతత్వాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది.

ఖర్చులు తగ్గి పెరగనున్న పోటీతత్వం

జీఎస్టీని తగ్గించటం వల్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తికి అయ్యే ఖర్చు తగ్గుతుంది. మొత్తం వ్యయాన్ని బట్టి యూనిట్ విద్యుత్తు ధర ఆధారపడి ఉంటుంది. తద్వారా విద్యుత్ సేకరణ విషయంలో పంపిణీ సంస్థలకు (డిస్కంలు) అయ్యే ఖర్చు తగ్గుతుందన్న అంచనా ఉంది. దీని వలన విద్యుత్ సేకరణ విషయంలో దేశవ్యాప్తంగా వార్షికంగా రూ. 2,000 కోట్ల నుంచి రూ. 3,000 కోట్ల వరకు ఆదా అవుతుంది. తక్కువ ధరల్లో స్వచ్ఛమైన విద్యుత్తును పొందడం ద్వారా తుది వినియోగదారులకు మేలు జరుగుతుంది. మొత్తంగా ఇది భారతదేశ విద్యుత్ రంగంలో దీర్ఘకాలిక స్థిరత్వాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

గృహాలు, రైతులు, గ్రామీణ వర్గాలకు ప్రయోజనాలు

ఈ సంస్కరణ గృహాలకు సంబంధించిన పైకప్పు సౌర విద్యుత్ సౌకర్యాలను మరింత అందుబాటు ధరల్లోకి తీసుకురానుంది. సాధారణ 3 కిలోవాట్ సౌర విద్యుత్ వ్యవస్థపై ఇప్పుడు సుమారు రూ. 9,000 నుంచి రూ. 10,500 వ్యయం తగ్గుతుంది. ఇది సౌర విద్యుత్ సదుపాయాలను ఏర్పాటు చేసుకోవటంలో లక్షలాది కుటుంబాలకు సహాయపడనుంది. పీఎం సూర్య ఘర్- ముఫ్త్ బిజిలీ యోజన కింద సౌర విద్యుత్ స్థాపనకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభిస్తుంది.

పీఎం-కుసుమ్ పథకం ప్రకారం రైతులు కూడా జీఎస్టీ సంస్కరణల నుంచి గణనీయంగా ప్రయోజనం పొందుతారు. సుమారు రూ. 2.5 లక్షలు ఖరీదు చేసే 5 హెచ్‌పీ సౌర విద్యుత్ పంపు ఇప్పుడు దాదాపు రూ. 17,500 తక్కువ ధరకే లభిస్తుంది. 10 లక్షల సౌర విద్యుత్ పంపులను పరిగణనలోకి తీసుకుంటే రైతులు సమష్టిగా రూ. 1,750 కోట్లు ఆదా చేస్తారు. మొత్తంగా నీటిపారుదల మరింత అందుబాటు ధరల్లోకి వచ్చి సుస్థిరమైనదిగా మారనుంది.

మినీ-గ్రిడ్‌లు, జీవనోపాధి పొందే పనులు, సౌర విద్యుత్ ఆధారిత నీటి పంపులు వంటి వికేంద్రీకృత కార్యకలాపాల ద్వారా గ్రామీణ, మారుమూల ప్రాంతాలు ప్రయోజనం పొందుతాయి. మునుపటితో పోల్చితే తక్కువ సమయంలోనే ఆదాయం రావటం, మెరుగైన రాబడి వల్ల పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, చిన్న వ్యాపారాలకు నమ్మదగిన హరిత ఇంధనం మరింత అందుబాటులో ఉండనుంది.

దేశీయ తయారీ, స్వావలంబనకు ప్రోత్సాహం

జీఎస్టీ తగ్గింపు వల్ల సౌర విద్యుత్ ఫలకాలతో పాటు విడి భాగాలపై ఖర్చులు 3 నుంచి 4 శాతం తగ్గుతాయి. ఇది భారతదేశంలో తయారైన పునరుత్పాదక ఇంధన పరికరాల పోటీతత్వాన్ని మెరుగుపరుస్తుంది. దీనితో పాటు భారత్‌లో తయారీ, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాలకు మద్దతునిస్తుంది. 2030 నాటికి 100 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలన్న లక్ష్యంతో భారత్ ముందుకు సాగుతున్నందున.. ఈ జీఎస్టీ సంస్కరణ దేశీయ తయారీలో కొత్త పెట్టుబడులను ప్రోత్సహిస్తుంది. ప్రతి గిగావాట్ సౌర విద్యుత్ తయారీ అనేది సుమారు 5,000 ఉద్యోగాలను సృష్టిస్తుందన్న అంచనాను పరిగణనలోకి తీసుకుంటే.. ఈ సంస్కరణ రాబోయే దశాబ్దంలో 5 లక్షల నుంచి 7 లక్షల వరకు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలకు మద్దతునిస్తుంది. ఇది దేశంలో హరిత ఇంధనానికి సంబంధించిన వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

జీఎస్టీ తగ్గింపు వల్ల ఉత్పత్తి వ్యయం తగ్గటంతో పాటు పెట్టుబడిదారుల విశ్వాసం కూడా మెరుగుపడుతుంది. మరింత వేగంగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకునేందుకు, ప్రాజెక్టును త్వరగా ప్రారంభించటానికి వీలు కల్పిస్తుంది. 2030 నాటికి దాదాపు 300 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనోత్పత్తి సామర్థ్యాన్ని అదనంగా సాధించాలని భారత్ భావిస్తున్నందున.. వ్యయం స్వల్పంగా 2 నుంచి 3 శాతం తగ్గినా, రూ. 1?1.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ప్రతి గిగివాట్ సౌరశక్తి ఏటా 1.3 మిలియన్ టన్నుల కార్బన్ డై యాక్సైడ్ విడుదలను తగ్గిస్తుంది. జీఎస్టీ తగ్గింపు వల్ల సౌరశక్తి ఉద్పాదక సామర్థ్యం వేగంగా పెరగుతుంది. తద్వారా 2030 నాటికి సంవత్సరానికి అదనంగా 50 మిలియన్ టన్నుల నుంచి 70 మిలియన్ టన్నుల కార్బన్ డై యాక్సైడ్ ఉద్గారాలను నివారించవచ్చు.

ఈ జీఎస్టీ సంస్కరణ పునరుత్పాదక విద్యుత్‌ను మరింత తక్కువ ధరల్లోకి, అందుబాటులోకి తీసుకొస్తుంది. దీన్నిబట్టి చూస్తే.. ఈ సంస్కరణ పారిస్ ఒప్పందంలో భాగంగా అంతర్జాతీయ స్థాయిలో భారత్ చేసిన ప్రకటనకు అనుగుణంగా ఉంది. దీనితో పాటు 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన సామర్థ్యం సాధించాలన్న భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్తుంది. వాతావరణ మార్పులకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతోన్న పోరాటంలో భారత్‌ను నాయకత్వ స్థాయిలో నిలబెడుతుంది.

కొత్త జీఎస్టీ రేట్లు 2025 సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ కీలక సంస్కరణ లక్షలాది మంది వినియోగదారులు, రైతులు, సంస్థలు, తయారీదారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చుతుంది. దీనితో పాటుగా హరిత ఇంధన వృద్ధి, ఇంధన స్వాతంత్ర్యం అనే జంట లక్ష్యాలకు దోహదం చేస్తుంది. వికసిత్ భారత్ దిశగా కొనసాగుతోన్న ప్రయాణానికి స్వచ్ఛమైన, అందుబాటు ధరల్లో సుస్థిర విద్యుత్ పునాదిగా ఉండేలా చూసుకోవాలన్న ప్రభుత్వ నిబద్ధతను ఇది తెలియజేస్తోంది.

# శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయం నిర్వహణలో రాజకీయ జోక్యం తగదు

**– భక్తుల విశ్వాసాన్ని కాపాడాలి**
**– కేరళ ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తగదు**
**– ఆధ్యాత్మిక అయ్యప్ప సేవా సంస్థలను భాగస్వామ్యం చేయాలి**
**– ఏబిఏపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు: టి.వి పుల్లంరాజు**

ఖమ్మం, సెప్టెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి) :శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వామివారి నిత్య కైంకర్యాలు ఆచార వ్యవహారాలలో రాజకీయ జోక్యాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, అయ్యప్ప స్వామి పై భక్తుల విశ్వాసాన్ని రాజకీయాలతో ముడిపెట్టవద్దని అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ ఏబిఏపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు టి.వి.పుల్లంరాజు శుక్రవారం కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2018వ సంవత్సరంలో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత సంబంధిత కార్యకలాపాలన్నీ అనవసర రాజకీయ జోక్యంతో కొనసాగుతున్నాయని ఈ చర్య ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అయ్యప్ప స్వామి సమాజాన్ని భక్తులను ఆందోళనకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వం ట్రావెన్ కోర్ ట్రస్ట్ బోర్డ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 20వ తేదీ శనివారం శబరిమల పంబ వద్ద అగోలా అయ్యప్ప సంగమం నిర్వహించడాన్ని స్వాగతించారు. ట్రావెన్కోర్ దేవశ్వం బోర్డు 75 వ వార్షికోత్సవ వేడుకలు విజయవంతం కావడానికి ఏబీఏపీ కృషి చేస్తుందన్నారు. ఈ సంగమం నిర్ణయంతో అయ్యప్ప భక్త సమాజం మొత్తాన్ని ఒకే చోట చేర్చి భక్తుల అభిప్రాయాలను ఫిర్యాదులను విని వారి ఆకాంక్షలను చర్చించి నెరవేర్చడానికి ఒక వేదికగా మారుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయం అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు ట్రావన్ కోర్ దేవస్వం ట్రస్ట్ బోర్డు ఆధ్యాత్మిక సేవా సంస్థలు, ట్రస్ట్ వాటాదారులతో చర్చించి నిర్ణయించాలని కోరారు. ప్రభుత్వం, దేవస్థానం బోర్డు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోరాదని అభిప్రాయపడ్డారు .ట్రావెన్కోర్ దేవశ్వం బోర్డ్ (టిడిబి) ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించడానికి కేరళ ప్రభుత్వం, ట్రస్ట్ బోర్డు సభ్యులు, అధికారులు, ఆధ్యాత్మిక సేవా సంఘాలతో కలిపి వేయి మందితో కమిటీ ఏర్పాటు చేశారని ప్రపంచ వ్యాప్తంగా మూడు వేల మంది డెలిగేట్స్ తో నిర్వహించే ఈ ఆధ్యాత్మిక వేడుకలకు అందిన ఆహ్వానంతో సమావేశానికి హాజరుకానున్నట్లు తెలిపారు.

ఈ ప్లాటినం జూబ్లీ వేడుకలతో అయ్యప్ప భక్త సమాజం కోరుకునే విలువైన ఆధ్యాత్మిక సాంప్రదాయాలను గౌరవించే విధంగా శబరిమల ఆచార వ్యవహారాలకు భంగం వాటిల్లకుండా సరైన నిర్ణయాలు తీసుకొనుటకు వేదిక కావాలని ఆకాంక్షించారు.

# వలపన్ని పట్టేసిన పోలీసులు..




అమరావతి, సెప్టెంబర్ 19:చిత్తూరు పట్టణం జనసంచారం లేని ప్రాంతాల్లో ప్రేమ జంటలను బెదిరించి నగలు, నగదు దోచుకున్న ఓ వ్యక్తిని శుక్రవారం చిత్తూరు వన్ టౌన్ పోలీసులు అరెస్టుచేశారు. నిందితుడు నుంచి రూ.1.20 లక్షల 12 గ్రాముల బంగారు నగలు, బైకును స్వాధీనం చేసుకున్నారు.

చిత్తూరు పట్టణంలోని పీవీకేఎన్ డిగ్రీ కాలేజీ వెనుక అటవీ ప్రాంతంలోని ఓ ప్రేమ జంటను బెదిరించి బంగారు నగలు, నగదు దోచుకు వెళ్లారనే ఫిర్యాదుతో చిత్తూరు వన్ టౌన్ సీఐ మహేశ్వర కేసు దర్యాప్తు ప్రారంభించారు.

ప్రత్యేక బృందాలుగా నిందితుడి కోసం గాలించగా.. శుక్రవారం ఉదయం పీవీకేఎన్ డిగ్రీ కాలేజీ వెనుక అటవీ ప్రాంతంలో చిత్తూరు కొంగరెడ్డిపల్లి కి చెందిన అకీల్ అనే యువకుని అరెస్టు చేశారు. నేరస్థులపై చిత్తూరు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని, ప్రజల భద్రతకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న ఆఫీసర్స్, ఐడి పార్టీ సిబ్బందిని చిత్తూర్ జిల్లా ఎస్.పి.తుషార్ దూడి, చిత్తూర్ డీఎస్పీ సాయినాథ్ అభినందించారు.

# నిండిన ఎన్టీఆర్ జలాశయం

చిత్తూరు సెప్టెంబర్ 19: చిత్తూరు జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా చిత్తూరు తాగునీటికి ఉద్దేశించిన ఎన్టీఆర్ జలాశయం పూర్తిగా నిండిపోయింది. జలాశయానికి ఎగువనున్న మండలాల్లో భారీగా వర్షపాతం నమోదు కావడంతో వరద నీరు భారీగా ఎన్టీఆర్ జలాశయానికి చేరుకుంది. ఎన్టీఆర్ జలాశయం 109.17 ఎంసిఎఫ్టి సామర్థ్యం కాగా రెండు రోజుల్లో పూర్తిగా నిండి నిండుకుండలా మారింది. దీంతో ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు ఒక గేటును ఎత్తి, 85 క్యూసెక్ల నీటిని కిందికి వదులుతున్నారు.

ఈ విషయమై పెనుమూరు తాహసీల్దార్ మాట్లాడుతూ ఒక గేటు మాత్రమే ఎత్తడం జరిగిందని, పరిస్థితి అదుపులో ఉందన్నారు. అవసరాన్ని బట్టి మరిన్ని గేట్లను ఎత్తే విషయం ఇరిగేషన్ అధికారులు ఆలోచిస్తారన్నారు. ఎన్టీఆర్ జలాశయానికి దిగువన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. చిత్తూరు తాగునీటి కోసం ఉద్దేశించిన ఎన్టీఆర్ జలాశయాన్ని పెనుమూరు మండలం కల్వకుంట వల్ల వద్ద 1996లో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు.

2004లో ఈ జలాశయం నిర్మాణం పూర్తయింది. ఆ రోజు నుంచి చిత్తూరు పట్టణానికి ఎన్టీఆర్ జలాశయం ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

ఇటీవల కాలంలో జలాశయంలో నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తిరిగి ఎన్టీఆర్ జలాశయం పూర్తిగా నిండిపోయింది. జిల్లాలో 17, 18 తేదీల్లో అన్ని మండలాల్లో వర్షపాతం నమోదయింది. 17వ తేదీన జిల్లా సగటున 31 మిల్లీమీటర్లు, 18 వ తారీఖున 25.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు బాగా రెండు రోజుల్లో కలిపి 123.6 మిల్లీమీటర్ల వర్షపాతం జిల్లా వ్యాప్తంగా నమోదయింది. ఎన్టీఆర్ జలాశయానికి ఎగువనున్న ఐరాల మండలంలో 140 మిల్లీమీటర్లు, పూతలపట్టులో 149.4 మిల్లీమీటర్లు, రొంపిచర్లలో 81.8, సదంలో 205.4, పులిచర్లలో 173.4, తవణంపల్లిలో 14 మంది మీటర్ల వర్షపాతం నమోదు అయింది. ఈ నీళ్లు భారీగా ఎన్టీఆర్ జలాశయానికి చేరడంతో తిరిగేసిన అధికారులు ఒక గేటును ఎత్తివేశారు.

# యుద్ధాలు, ఉద్రిక్తతలు, ప్రపంచ లాబీల యుగంలో.. చర్చల వారధిగా ఎదిగిన శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 75వ పుట్టినరోజు సందర్భంగా కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ఆయనకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు 'ఎక్స్' వేదికగా వరుస పోస్టులు చేశారు. "త్యాగం, అంకితభావాలకు ప్రతీక... లక్షలాది మందికి స్ఫూర్తిప్రధాత... ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి 75వ పుట్టినరోజు సందర్భంగా హృదయ పూర్వక శుభాకాంక్షలు" అని కేంద్ర హోంమంత్రి పేర్కొన్నారు. ప్రధాన మంత్రి మోదీ తన ప్రజా జీవితంలో అయిదు దశాబ్దాలకు పైగా దేశప్రజల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారన్నారు. 'దేశం ముందు' అనే విధానాన్ని అనుసరిస్తూ ప్రతి పౌరుడికీ స్ఫూర్తినిస్తున్నారని కేంద్ర హోంమంత్రి తెలిపారు.

సంఘ్ నుంచి పార్టీ, ప్రభుత్వం దాకా సాగిన ప్రధానమంత్రి మోదీ జీవనయానం... హిమాలయమంత సంకల్పం, సముద్రమంత విశాల దృక్పథం ఉన్నప్పుడు... సుదూర లక్ష్యాలను సైతం సాధించేందుకు అపారమైన అవకాశాలు ఉంటాయని శ్రీ అమిత్ షా తెలిపారు. శ్రీ మోదీ పాలనలో సమగ్రతనూ, నిర్ణయాల్లో దృఢత్వాన్నీ, విధానాల్లో స్పష్టతనూ తీసుకువచ్చారని పేర్కొన్నారు. అణగారిన, వెనకబడిన వర్గాలు, పేదలు, మహిళలు, గిరిజనులు కేంద్రంగా పాలన సాగిస్తూ వారి అభివృద్ధికి చిరస్మరణీయమైన కృషి చేస్తున్నారని కొనియాడారు. లక్షలాది మంది జీవితాల్లో ఊహించని మార్పును తీసుకువచ్చి, వారిని 'అభివృద్ధి చెందిన', 'స్వయం-సమృద్ధ భారత్' నిర్మాణంలో భాగస్వాములను చేస్తున్న శ్రీ నరేంద్ర మోదీ దేశానికే గర్వకారణమన్నారు.

గత నాలుగు దశాబ్దాలుగా వివిధ బాధ్యతల్లో శ్రీ మోదీ సమర్థతను గమనిస్తున్నానని కేంద్ర హోంమంత్రి తెలిపారు. సంఘ్ ప్రచారక్, పార్టీ కార్యకర్త, గుజరాత్ ముఖ్యమంత్రి, గత 11 సంవత్సరాల నుంచి భారత ప్రధానమంత్రిగా శ్రీ నరేంద్ర మోదీ ఎల్లప్పుడూ దేశానికే తొలి ప్రాధాన్యమిచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రతి బాధ్యతలోనూ ఆయనతో కలిసి పనిచేసే అవకాశం లభించడం తన అదృష్టమని శ్రీ అమిత్ షా అన్నారు. అన్ని బాధ్యతల్లోనూ శ్రీ నరేంద్ర మోదీ నిర్మాణాత్మక పనిని, నిర్ణయాలనూ ప్రోత్సహించారన్నారు. ఆయన తీసుకునే ప్రతి నిర్ణయం దేశాన్ని నిరంతరం ముందుకు నడిపిస్తుందని శ్రీ అమిత్ షా తెలిపారు. అభివృద్ధిని ఊహించని ప్రతి మారుమూల ప్రాంతానికి గత 11 సంవత్సరాల్లో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను శ్రీ మోదీ అందించారని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు. అస్సాంలో అతి పొడవైన వంతెన, కాశ్మీర్‌లో ప్రపంచంలోనే ఎత్తయిన చీనాబ్ రైల్వే వంతెన, సెమీ కండక్టర్ల యూనిట్లు, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలు.. శ్రీ మోదీజీ ప్రభుత్వంలో భారత్ ప్రతి రంగంలోనూ నంబర్ వన్ అని సూచిస్తున్నాయని తెలిపారు. వీధి వ్యాపారులు కూడా సగర్వంగా యూపీఐని చూపడం శ్రీ నరేంద్ర మోదీ పరిపాలన దక్షతకు నిదర్శనమని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు.

అభివృద్ధి, ఆర్థిక వృద్ధీ ఏకకాలంలో సాధించడం అసాధ్యమని చెప్పుకునేవారు.. అయితే పేదల సంక్షేమం, ఆర్థికవృద్ధిని ఏకకాలంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సుసాధ్యం చేసి చూపారని పేర్కొన్నారు. ప్రపంచంలో 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. ఆయన నాయకత్వంలో నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందిందని కేంద్ర హోంమంత్రి తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒక ధృవతార వంటిదని ఐఎమ్ఎఫ్ సైతం పేర్కొన్నది. దేశ వృద్ధిరేటు ప్రపంచంలోనే అత్యధికంగా ఉంది. దేశంలో 600 మిలియన్ల మంది నేడు పేదరికం నుంచి బయటపడుతున్నారు.. మన దేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో అగ్రగామిగా మారుతోంది.. ఇది శ్రీ మోదీ యుగంలో మాత్రమే సాధ్యమని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత, సమస్యల పరిష్కారం పట్ల ఆయన అంకితభావం ఆయన మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శనమనీ.. నేడు ప్రపంచమంతా ఆయనను సమస్యలు పరిష్కరించగల సమర్థ నేతగా కీర్తిస్తోందని శ్రీ అమిత్ షా తెలిపారు. యుద్ధాలు, ఉద్రిక్తతలు, ప్రపంచ లాబీల యుగంలో.. ప్రపంచం ముందు చర్చల వారధిగా ప్రధానమంత్రి శ్రీ మోదీ ఎదిగారని ఆయన కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా 27 దేశాల అత్యున్నత పౌర పురస్కారాలను విశ్వామిత్ర మోదీజీ అందుకున్నారనీ... ఆయన ప్రపంచ నాయకత్వానికి ఈ పురస్కారాలే నిదర్శనమని శ్రీ అమిత్ షా పేర్కొన్నారు.

# జీతం పెంచాలని నిరసన..

అమరావతి, సెప్టెంబర్ 19:పదివేల రూపాయలు జీతంతో బతకలేకపోతున్నామని తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కోదూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం వీఆర్ఏలు నిరసన వ్యక్తం చేశారు.

ఈసందర్భంగా వీఆర్ఏ నాయకులు మాట్లాడుతూ.. జీతాలను 26 వేల రూపాయలకు పెంచాలని, వీఆర్ఏలను వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలని, వీఆర్ఏలకు నైట్ డ్యూటీలు వేయవద్దని డిమాండు చేశారు. వీఆర్ఏలకు మద్దతుగా రైతు సంఘం, రైతు కార్మిక సంఘ నాయకులు మద్దతు తెలిపారు.

సంఘ నేతలు వల్లభనేని లక్ష్మణరావు, పులిగడ్డ అంకారావు, సోమయ్య, బిక్షం, రాముతో పాటు రైతు సంఘ నేతలు ఆవల బసవయ్య, పోలబత్తిన మోహన్ రావు పాల్గొన్నారు.

# చర్చలు విఫలమైనప్పుడు భారత్ ఎంచుకునే మార్గానికి ఆపరేషన్ సిందూర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:'ఆపరేషన్ సిందూర్, 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలకోట్ వైమానిక దాడులు భారత్ సహనమో, బలహీనతో కాదు... అతిపెద్ద బలమని రుజువు చేస్తున్నాయి. చర్చలు ఎటువంటి పరిష్కారాన్నీ ఇవ్వనప్పుడు మనం శక్తితో కూడిన కఠినమైన మార్గాన్ని ఎంచుకుంటాం" అని ఈనెల 17న నిర్వహించిన హైదరాబాద్ విమోచన దినోత్సవ కార్యక్రమంలో రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలోని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని బలమైన, దృఢ నిశ్చయంతో కూడిన నవ భారత్ చర్చల ప్రక్రియను విశ్వసిస్తుందన్నారు. శాంతి, సద్భావన భాషను అర్థం చేసుకోలేని వారికి తగిన సమాధానం ఎలా ఇవ్వాలో కూడా నవ భారత్‌కు తెలుసునని ఆయన స్పష్టం చేశారు.

మతం ఆధారంగా అమాయక పౌరులను పహల్గామ్‌లో ఉగ్రవాదులు చంపితే.. వారి కర్మ సిద్ధాంతాన్ని అనుసరిస్తూ వారు భారత సాయుధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో హతమయ్యారనీ.. పాకిస్తాన్, పీఓకేలోని వారి ఆవాసాలు పూర్తిగా నాశనమయ్యాయని రక్షణ మంత్రి తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా అమలు చేసిన సాయుధ దళాల శౌర్యం, అంకితభావాన్ని ప్రశంసిస్తూ.. ఈ ఆపరేషన్‌ను తాత్కాలికంగానే నిలిపివేశామన్నారు. సరిహద్దు అవతల నుంచి తిరిగి ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగితే పూర్తిస్థాయిలో దాడి తిరిగి ప్రారంభమవుతుందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కాల్పుల విరమణపై మూడో పక్షం జోక్యాన్ని భారత్ తిరస్కరించిందనీ.. భారత అంతర్గత విషయాల్లో మూడో పక్షం ఏదీ జోక్యం చేసుకోలేదని ఆయన స్పష్టం చేశారు.

ఉత్తర, దక్షిణ భారతదేశాన్ని ఏకం చేయడంలో 'ఉక్కు మనిషి' గా సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషిని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. హైదరాబాద్ విమోచన దినోత్సవం.. ప్రధానమంత్రి మోదీ పుట్టినరోజు సెప్టెంబర్ 17నే జరుపుకొంటున్నామని గుర్తుచేసిన శ్రీ రాజ్‌నాథ్ సింగ్... "సర్దార్ పటేల్ లాగే మన ప్రధానమంత్రి దేశాన్ని సాంస్కృతికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారు." అని వ్యాఖ్యానించారు.

దేశాన్ని తిరుగులేని శక్తిగా మార్చిన ఘనత ప్రధానమంత్రి శ్రీ మోదీకే చెందుతుందన్న రక్షణ మంత్రి.. త్వరలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ""నేటి భారత్ ఎవరి ఆదేశాలూ తీసుకోదు... తన సొంత నిర్ణయాలతోనే ముందుకు సాగుతుంది" అని ఆయన తెలిపారు.

ఆపరేషన్ పోలోలో పాల్గొన్న సైనికుల ధైర్యాన్ని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. ఈ ఆపరేషన్ కేవలం సైనిక చర్య కాదన్నారు. సర్దార్ పటేల్ నిర్ణయాత్మక వ్యూహంతో రజాకార్ల కుట్రలను బద్దలు కొట్టి హైదరాబాద్‌ను తిరిగి భారత్‌లో విలీనం చేశారని ఆయన వ్యాఖ్యానించారు. ఆపరేషన్ పోలో విజయం.. భారత్‌లో హైదరాబాద్ విలీనం.. జాతి ఐక్యతను కాపాడుకోవడంలో భారత్ ఎల్లప్పుడూ సమర్థంగా, శక్తిమంతంగా ఉందని ప్రపంచానికి నిరూపించిన అద్భుతమైన అధ్యాయంగా రక్షణ మంత్రి అభివర్ణించారు.

"1948లో రజాకార్ల కుట్ర విఫలమైనట్లే... నేడు పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదం, ఆ దేశపు ఏజెంట్లూ విఫలమయ్యారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ మరోసారి తగిన సమాధానమిచ్చింది. మన ఐక్యత, సాంస్కృతిక వైవిధ్యమే మన గొప్ప బలమని మనం మరోసారి నిరూపించాం'' అని రక్షణ మంత్రి వ్యాఖ్యానించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిర్వహించిన హైదరాబాద్ విమోచన దినోత్సవ ఛాయాచిత్ర ప్రదర్శననూ శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తిలకించారు. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్, బొగ్గు-గనుల శాఖ మంత్రి శ్రీ జి కిషన్ రెడ్డి, హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పర్యవేక్షణలో ప్రజాప్రతినిధులు



అమరావతి, సెప్టెంబర్ 19:మాచర్ల పట్టణంలో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాక సందర్భంగా ఏర్పాట్లను మాజీ సభ్యులు పెందుర్తి వెంకటేష్, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, జిల్లా ఎస్పీ కృష్ణారావు, ఇతర రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో కలసి ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం పర్యవేక్షించారు.

హెలిప్యాడ్ , ప్రజా వేదిక, క్యాడర్ మీటింగ్ నిర్వహించే సభ ప్రాంగణం, యాదవ బజారులలో ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, అసౌకర్యాలు లేకుండా చూసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే జూలకంటి పలు సూచనలు చేశారు.

# దసరా ఏర్పాట్లపై కలెక్టర్ బిజీబిజీ

## హోల్డింగ్ ప్రాంతాల తనిఖీ..సిబ్బందికి దిశానిర్దేశం



అమరావతి, సెప్టెంబర్ 19:భక్తులకు ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా దసరా మహోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ నెల 22న ప్రారంభమయ్యే దసరా మహోత్సవాల ఏర్పాట్లను శుక్రవారం ఉదయం పర్యవేక్షించారు. 15 లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశమున్నందున అందుకు తగ్గట్లు చేసిన ఏర్పాట్లలో ఎక్కడా లోపాలు లేకుండా అధికారులకు దిశానిర్దేశం చేశారు. మూలా నక్షత్రం రోజున అధిక సంఖ్యలో వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు.

హోల్డింగ్ పాయింట్ల తో పాటు కేశ ఖండనశాల, స్నాన ఘట్టాలు, క్యూ లైన్లు, పార్కింగ్, భద్రత.. ఇలా ప్రతి విషయాన్నీ క్షుణ్నంగా పరిశీలించారు. గిరి ప్రదర్శనతో ముడిపడిన అంశాలనూ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఆయా మార్గాలను పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిరంతర పర్యవేక్షణతో ఎక్కడ ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తక్షణం పరిష్కరించేందుకు, కమ్యూనికేషన్ పరంగా వేగాన్ని అందిపుచ్చుకునేందుకు, సమన్వయ సాధనకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనం, నగర పర్యటన మధురానుభూతులను మిగిల్చేలా ఈసారి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# నేపాల్ ప్రజల పురోగతి, శాంతి, సుస్థిరత పునరుద్ధరణకు భారత్ పూర్తిగా సహకరిస్తుందన్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:నేపాల్ తాత్కాలిక ప్రధానమంత్రి గౌరవ శ్రీమతి సుశీల కర్కితో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ ఫోన్లో మాట్లాడారు. నేపాల్ తాత్కాలిక ప్రధానిగా నియమితులైన శ్రీమతి సుశీల కర్కిని అభినందిస్తూ... భారత ప్రభుత్వం, ప్రజల తరపున ప్రధానమంత్రి మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

నేపాల్ లో ఇటీవల జరిగిన నిరసనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిపట్ల ప్రధానమంత్రి సంతాపం తెలియజేశారు.

రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి భారత్ సిద్ధంగా ఉందని, నేపాల్ ప్రజల పురోగతి, శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించటానికి భారత్ పూర్తి మద్దతును అందిస్తుందని ప్రధానమంత్రి తెలిపారు. ఇరుదేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయాలన్న ప్రధానమంత్రి వ్యాఖ్యలపై స్పందించిన నేపాల్ ప్రధానమంత్రి కర్కి... తమ దేశానికి మద్దతుగా నిలిచినందుకు భారత ప్రధానమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

రాబోయే నేపాల్ జాతీయ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

# యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్‌లో భారీ చేరికలు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 19:జిల్లా కేంద్రంలోని కళ్యాణ లక్ష్మి గార్డెన్స్‌లో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో చేరికల కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షుడు కర్నాల అనిల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో, జిల్లా సెస్ అసిస్టెంట్ హెల్పర్స్‌లో 100 మందికి పైగా వివిధ సంఘాల నుంచి బయట కు వచ్చి యూనియన్‌లో చేరారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. స్వామి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి. గోవర్ధన్ సమక్షంలో వీరందరిని కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎన్. స్వామి, వి. గోవర్ధన్ మాట్లాడుతూ

"2018లో అసిస్టెంట్ హెల్పర్ నియామకాలు జరగ్గా, 2020లో ప్రొబేషన్ పీరియడ్ పూర్తయింది. అయితే అప్పటి నుంచి ఐదు సంవత్సరాలు గడిచినా అసిస్టెంట్ హెల్పర్లను హెల్పర్‌గా ప్రమోట్ చేయకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. మేనేజ్మెంట్, సెస్ చైర్మన్ తక్షణం జోక్యం చేసుకొని అసిస్టెంట్ హెల్పర్లకు హక్కైన పదోన్నతులు కల్పించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ తరఫున డిమాండ్ చేశారు. అలాగే సంస్థ అభివృద్ధి, పరిరక్షణలో యూనియన్ ప్రధాన పాత్ర పోషిస్తుందని" స్పష్టం చేశారు.

తరువాత సెస్ చైర్మన్, ఎండికి వినతిపత్రం సమర్పించగా, వారు సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కారం కోసం ప్రయత్నిస్తామని భరోసా ఇచ్చారు. యూనియన్‌పై విశ్వాసం ఉంచి చేరిన సభ్యులందరికీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ సింగిరెడ్డి చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, శ్రీనివాస్, ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు కొమురయ్య, సిటూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, కార్యదర్శి రమణ, సెస్ అసిస్టెంట్ హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

# యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల తాత్కాలిక జాబితాలో భారత్ నుంచి మరో ఏడు ప్రదేశాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:ప్రపంచ వేదికపై సుసంపన్న, సహజ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలోనూ, ప్రదర్శించడంలోనూ భారత్ తన ప్రత్యేకతను కొనసాగిస్తూనే ఉంది. దేశం మరింత గర్వించేలా మరో ఏడు అద్భుతమైన ప్రకృతి వారసత్వ ప్రదేశాలు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల తాత్కాలిక జాబితాలో విజయవంతంగా చేరాయి. దీనితో తాత్కాలిక జాబితాలో భారత వారసత్వ ప్రదేశాల సంఖ్య 62 నుంచి 69కి పెరిగింది.

ఈ చేరికతో, యునెస్కో పరిశీలనలో ఇప్పుడు భారత్ నుంచి మొత్తం 69 ప్రదేశాలు ఉన్నాయి. వీటిలో 49 సాంస్కృతిక, 17 సహజ, 3 మిశ్రమ వారసత్వ ప్రదేశాలు ఉన్నాయి. ఈ విజయం అసాధారణమైన ప్రకృతి, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడానికి, ప్రోత్సహించడానికి భారత్ కు గల నిరంతర నిబద్ధతకు నిదర్శనం.

యునెస్కో నియమావళి ప్రకారం, ప్రతిష్ఠాత్మక ప్రపంచ వారసత్వ జాబితాలో నామినేట్ కావాలంటే, ఏ ప్రదేశమైనా ముందుగా ఈ తాత్కాలిక జాబితాలో చోటు సంపాదించడం తప్పనిసరి.

కొత్తగా చేరిన ప్రదేశాల వివరాలు

మహారాష్ట్రలోని పంచగని, మహాబలేశ్వర్ వద్ద ఉన్న దక్కన్ ట్రాప్స్: ప్రపంచంలోనే ఎక్కువ శాస్త్రీయ అధ్యయనాలు జరిగిన లావా ప్రవాహాలివి. ప్రాధాన్యత దృష్ట్యా గొప్పగా సంరక్షించుకున్న ప్రాంతాలు. ఈ ప్రదేశాలు భారీ దక్కన్ ట్రాప్స్‌లోనూ, ఇప్పటికే యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన కోయినా వన్యప్రాణుల అభయారణ్యంలో ఉన్నాయి.

కర్ణాటకలోని సెయింట్ మేరీస్ ఐలాండ్ క్లస్టర్ భౌగోళిక వారసత్వం: అరుదైన స్తంభాకార బసాల్టిక్ రాతి నిర్మాణాలకు ప్రసిద్ధి చెందిన ఈ ద్వీప సమూహం చివరి క్రెటేషియస్ కాలం నాటిది. సుమారు 8.5 కోట్ల సంవత్సరాల కిందట నాటి ప్రాంతం.

మేఘాలయ యుగం గుహలు, మేఘాలయ: మేఘాలయలోని అద్భుతమైన గుహ వ్యవస్థలు, ముఖ్యంగా మావ్మ్లూహ్ గుహ, హోలోసీన్ యుగంలో మేఘాలయ యుగానికి ప్రపంచ ప్రామాణిక కేంద్రంగా నిలిచాయి. ఇవి ముఖ్యమైన వాతావరణ, భౌగోళిక మార్పులను ప్రతిబింబిస్తాయి.

నాగాలాండ్‌లోని నాగా హిల్ ఓఫియోలైట్: నాగాలాండ్‌లో కనిపించే భౌగోళిక అద్భుతం. సముద్ర మట్టిలో ఏర్పడిన రాళ్లు భూమి ఉపరితలానికి లేచినట్టు ఉంటాయి. భూమి పొరల్లో కదలికలు, మధ్య సముద్ర శ్రేణుల గతిపై ఇవి అవగాహనను అందిస్తాయి.

ఎర్ర మట్టి దిబ్బలు (ఎర్ర ఇసుక కొండలు), ఆంధ్రప్రదేశ్: విశాఖపట్నం సమీపంలో కనిపించే ఈ కళ్లు చెదిరే ఎర్రటి ఇసుక ఆకృతులు, భూ వాతావరణ చరిత్రను చురుకైన పరిణామ క్రమాన్ని ప్రతిబింబించే ప్రత్యేక వాతావరణ, తీరప్రాంత భూభౌగోళిక లక్షణాలను ఆవిష్కరిస్తాయి.

తిరుమల కొండల ప్రకృతి వారసత్వం, ఆంధ్రప్రదేశ్: ఎపార్కియన్ అన్‌కన్ఫార్మిటీ, ప్రతిష్ఠాత్మకమైన శిలాతోరణం కలిగి ఉన్న ఈ స్థలం... భూమి చరిత్రలో 1.5 బిలియన్ సంవత్సరాలకు పైగా గల భూగర్భ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించే అపారమైన భౌగోళిక విలువను కలిగి ఉంది.

వర్కల క్లిఫ్స్, కేరళ: కేరళ తీరప్రాంతంలో విస్తరించి ఉన్న ఈ అందమైన కొండచరియలు, మియో ప్లియోసీన్ యుగానికి చెందిన వర్కల్లి ఫార్మేషన్ ను వివరిస్తాయి. ఇవి సహజసిద్ధమైన ఊటలు. ఆకర్షణీయమైన కోత భూరూపాలతో శాస్త్రీయంగా, పర్యాటకపరంగా ప్రాముఖ్యతను కలిగిఉన్నాయి.

ప్రపంచ వారసత్వం పట్ల భారత్ నిబద్ధత

తాత్కాలిక జాబితాలో ఈ ప్రదేశాలను చేర్చడం ప్రపంచ వారసత్వ జాబితాకు భవిష్యత్తు నామినేషన్ల దిశగా ఒక ముఖ్యమైన అడుగు. ప్రకృతి అద్భుతాలను ప్రపంచ వారసత్వ పరిరక్షణ ప్రయత్నాలతో ఏకీకృతం చేయడంపై భారత వ్యూహాత్మక దృష్టిని ఇది ప్రతిబింబిస్తుంది.

భారతదేశం తరఫున ప్రపంచ వారసత్వ సదస్సుకు నోడల్ ఏజెన్సీగా ఉన్న ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) నామినేషన్ల సంకలనం, సమర్పణలో కీలక పాత్ర పోషించింది. పారిస్ లోని యునెస్కోలో భారత శాశ్వత ప్రతినిధి ఈ ప్రయత్నంలో అంకితభావంతో పనిచేసినందుకు ఏఎస్ఐని అభినందించారు.

జూలై 2024లో న్యూఢిల్లీలో ప్రపంచ వారసత్వ కమిటీ 46వ సదస్సుకు భారత్ సగర్వంగా ఆతిథ్యం ఇచ్చింది. ఇందులో 140 పైగా దేశాల నుంచి 2000 మంది ప్రతినిధులు, నిపుణులు పాల్గొన్నారు.

# లే...లోని జాతీయ సోవా రిగ్పా జాతీయ సంస్థకు స్కూల్ బస్సును ప్రధానం చేసిన ఎస్‌బీఐ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:లే ప్రాంతంలోని జాతీయ సోవా రిగ్పా సంస్థ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోవా రిగ్పా..ఎన్ఐఎస్ఆర్)కు ఒక స్కూల్ బస్సును భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ) బహూకరించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)గా ఎస్‌బీఐ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ స్కూల్ బస్సును అందించింది. ఎస్‌బీఐ చండీగఢ్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ కృషన్ శర్మ ఈ బస్సును ఎన్ఐఎస్ఆర్ డైరెక్టరు డాక్టర్ పద్మా గుర్మేత్ కు ఈ రోజు లేలో లాంఛనంగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ జమ్మూకాశ్మీర్ జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (బిజినెస్, కార్యకలాపాలు) శ్రీ జయంత్ మణి, ఎస్‌బీఐ లే బ్రాంచి చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ అనిల్ టాండన్, బ్యాంకుకు చెందిన ఇతర సీనియర్ అధికారులతో పాటు ఎన్ఐఎస్ఆర్ ఫేకల్టీ సభ్యులు, సిబ్బంది, ఎన్ఐఎస్ఆర్ విద్యార్థులు పాల్గొన్నారు.

లే లోని ఎన్ఐఎస్ఆర్ విద్యార్థుల కోసం స్కూల్ బస్సును ఇచ్చినందుకు ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ కృషన్ శర్మకు ఎన్ఐఎస్ఆర్ డైరెక్టరు డాక్టర్ పద్మా గుర్మేత్ కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ సోవా రిగ్పా సంస్థ కార్యకలాపాలను, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను డాక్టర్ పద్మా గుర్మేత్ సంక్షిప్తంగా వివరించారు.

ఆహూతులను ఉద్దేశించి ఎస్‌బీఐ చండీగఢ్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ కృషన్ శర్మ ప్రసంగిస్తూ, దేశవ్యాప్తంగా ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఎస్‌బీఐ అండగా ఉంటుందని పునరుద్ఘాటించారు. ప్రజాసేవకూ, ప్రాంతీయ అభివృద్ధికీ కట్టుబడి పనిచేసే సంస్థలతో భాగస్వామ్యాన్ని పటిష్ఠం చేసుకోవాలని ఎస్‌బీఐ నిబద్ధతతో ఉందని ఆయన స్పష్టం చేశారు.

స్టేట్ బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలను అమలుచేస్తూ, లద్దాఖ్ సామాజిక-ఆర్థిక ప్రగతికి తోడ్పడే దిశగా నిరంతరంగా కృషి చేస్తోందని ఈ కార్యక్రమం చాటి చెబుతోంది.

# పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్



గద్వాల : పత్తి కొనుగోళ్లు సాఫీగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం లోని తన చాంబర్లో వ్యవసాయ, మార్కెటింగ్, ప్రణాళిక శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. రైతులకు తగిన మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లో తూకం, చెల్లింపుల్లో పారదర్శకత పాటించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని, అవసరం మేరకు గద్వాలలో రెండు, అలంపూర్‌లో ఒకటి చొప్పున మూడు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్టోబర్ మాసం చివరి వారం నుంచి కొనుగోలు ప్రక్రియ ప్రారంభించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

పత్తి తేమశాతం 8 వరకు ఉండాలని, పత్తి కొనుగోలుకు కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకునే విధంగా వ్యవసాయ విస్తీర్ణాధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ యాప్ ద్వారానే రైతులు స్లాట్ బుకింగ్ చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, వ్యవసాయ శాఖ ఏడీ సంగీత లక్ష్మి, సీసీఐ అసిస్టెంట్ మేనేజర్ దిలీప్, లీగల్ మెట్రాలజీ, పోలీస్, ఫైర్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

## -8 కిలోల కాంప్లెక్స్ ఓవేరియన్ ట్యూమర్ తొలగింపు



ఖమ్మం, సెప్టెంబర్ 19:సింగరేణి ప్రధాన హాస్పిటల్, కొత్తగూడెంలోని వైద్యుల బృందం 65 ఏళ్ల మహిళకు 8 కిలోల కాంప్లెక్స్ ఓవేరియన్ ట్యూమర్ ను విజయవంతంగా తొలగించింది. రోగి అనేక ప్రైవేట్ హాస్పిటల్స్‌కు తిరిగి ఎక్కడా కూడా శస్త్ర చికిత్స చేయడం క్లిష్టం అని తెలిపిన పిమ్మట సింగరేణి ప్రధాన ఆస్పత్రికి రావడం జరిగింది. ఈ శస్త్రచికిత్సను సింగరేణి ప్రధాన ఆస్పత్రి బృందం శుక్రవారం కంబైన్డ్ స్పైనల్, ఎపిడ్యూరల్ అనస్థీషియా కింద నిర్వహించింది. రోగి హైపర్ టెన్షన్, అనీమియా ఇతర కో-మోర్బిడిటీలతో ఆస్పత్రికి రాగా వైద్యుల బృందం క్షుణ్ణంగా పరిశీలించి శస్త్రచికిత్సను విజయవంతం చేశారు.

ఈ నెల 12న కూడా ఇదే ఆస్పత్రిలో ఇలాంటి కాంప్లెక్స్ ఓవేరియన్ ట్యూమర్ కేసు విజయవంతంగా పూర్తి చేశారు. వరుసగా రెండు ప్రధాన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా సింగరేణి మెయిన్ హాస్పిటల్ వైద్యుల నైపుణ్యం, అత్యాధునిక వైద్య సదుపాయాలు మరొక్కసారి నిరూపితమయ్యాయి. ఈ శస్త్రచికిత్సలో గైనకాలజీ, అనస్థీషియా, నర్సింగ్, పారామెడికల్ బృందాలు సమన్వయంతో పనిచేశాయి. సింగరేణి ప్రధాన ఆస్పత్రి గైనకాలజిస్ట్ మాలతి, జనరల్ సర్జన్ వినూత్న, అనస్థియా వైద్యులు కాళేశ్వర్, కృష్ణమూర్తి, రవళి పాల్గొన్నారు.సర్జరీలో పాల్గొన్న వైద్య సిబ్బందిని చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్, అడిషనల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఉష అభినందించారు.

# 22 నెలల కాంగ్రెస్ పాలనలో గ్రామీణ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం : హరీశ్‌రావు




హైదరాబాద్, సెప్టెంబర్ 19:కాంగ్రెస్ ప్రభుత్వ 22 నెలల పాలనలో గ్రామీణ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం చేయబడింది అంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ గ్రామ పాలన వ్యవస్థను బలంగా చేస్తే, కాంగ్రెస్ కుప్ప కూల్చింది అని మండిపడ్డారు.

గ్రామ పంచాయతీలలో ట్రాక్టర్లకు డిజిల్ పోయించే డబ్బులు లేక మూలన పడేసిన దుస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. బతుకమ్మ పండుగ పూట కూడా వీధిదీపాలు వెలగక గ్రామాలు చీకటిలో ఉన్నాయి. రహదారులు, డ్రైనేజీలు మరమ్మతులు లేక గ్రామాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. గ్రామాల్లో సర్పంచ్ లేరు, ఎంపీటీసీ లేరు, స్థానిక సంస్థల ఎన్నికలు లేవు. కాంగ్రెస్ నిర్లక్ష్యానికి మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం అయ్యింది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం. తెలంగాణ ప్రతీక బతుకమ్మ పండుగను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. బతుకమ్మ పండుగ ఏర్పాట్లు లేవు, ప్రభుత్వం నుంచి స్పందన లేదు. ఎమ్మెల్యేల ఎసీడీపీ నిధులు విడుదల చేయకుండా అభివృద్ధిని అడ్డుకుంటోంది ప్రభుత్వం. అభివృద్ధి పనులు పూర్తిగా ఆగిపోయి ప్రజలపై భారం పడుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ కంటే ఎక్కువ ఢిల్లీలో ఉంటున్నారు.. పాలన గాలికి వదిలేశారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం కాదు కుట్రపూరితంగా గ్రామ పాలనను నాశనం చేసే రేవంత్ వైఫల్యం అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

# పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా చేపట్టాలి : ఎమ్మెల్యే బాలు నాయక్

నల్గొండ, సెప్టెంబర్ 19:పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా చేపట్టాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పిలుపునిచ్చారు. "స్వచ్ఛతా హీ సేవ 2025" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో చేపట్టిన స్వచ్ఛ పక్షోత్సవ్ కార్యక్రమంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని రహదారులు, ప్రజా స్థలాలు శుభ్రపరచి, ప్లకార్డులు పంపిణీ చేసి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా పరిశుభ్రతా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం మైనంపల్లి మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమి రాంసింగ్ ఆర్థిక సహకారంతో క్రీడాకారులకు పంపిణీ చేసిన కోట మైసమ్మ క్రికెట్ టీమ్ జెర్సీని ఆవిష్కరించారు.

# ఆ మున్సిపాలిటీ నుంచి వైఎస్ఆర్ పేరు తొలగింపు.. కీలక బిల్లులకు ఏపీ కేబినెట్ గ్రీన్‌సిగ్నల్



అమరావతి, సెప్టెంబర్ 19:ఏపీ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న వివిధ బిల్లులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

అసెంబ్లీలో ప్రవేశపెట్టే దాదాపు 13 బిల్లుల అంశాలపై చర్చించేందుకు ఏపీ మంత్రివర్గం శుక్రవారం నాడు సమావేశమైంది. ఈ సందర్భంగా ఆ 13 బిల్లులకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా నాలా ఫీజు రద్దుకు సంబంధించిన చట్టాలను సవరిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటిని తాడిగడప మున్సిపాలిటీగా సవరణకు ఆమోదం తెలిపింది. రాజధానిలో పెద్ద ప్రాజెక్టుల అమలుకు ప్రత్యేక వాహక నౌకల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955, ఏపీ మునిసిపాలిటీ యాక్ట్ 1965లకు ప్రజాప్రాతినిధ్య చట్టం 1950ను అనుసరించి ఓటర్ల జాబితా తయారీకి మూడు తేదీలను ఖరారు చేసే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రాజధాని పరిధిలో గతంలో 343 ఎకరాల భూసేకరణకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించింది. లిఫ్ట్ పాలసీ కింద చిన్న సంస్థల ఏర్పాటుకు భూముల కేటాయింపుకు ఆమోదం తెలిపింది. ఏపీ జీఎస్టీ బిల్లు 2025లో పలు సవరణల ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. వాహనమిత్ర కింద రూ.15వేలు ఇచ్చే ప్రతిపాదనను ఆమోదించింది.

# వికసిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా స్మార్ట్, గ్రీన్, సుస్థిర పట్టణ వ్యవస్థలుగా కంటోన్మెంట్ ప్రాంతాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19: భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ప్రాంతాలను స్మార్ట్, గ్రీన్, సుస్థిర పట్టణ వ్యవస్థలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలనీ.. 2035 నాటికి లక్ష్యాన్ని సాధించాలని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీస్ (ఐడీఈఎస్) అధికారులకు పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్ ఏ2047 కోసం వ్యూహాత్మక రోడ్‌మ్యాప్' ప్రధాన ఇతివృత్తంగా డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ డిఫెన్స్ ఎస్టేట్స్ (డీజీడీఈ) ఈ రోజు న్యూఢిల్లీలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు- 'మంథన్ 2025'లో ఆయన కీలకోపన్యాసం చేశారు.

18 లక్షల ఎకరాలకు పైగా రక్షణ భూముల నిర్వహణ.. దేశవ్యాప్తంగా 61 కంటోన్మెంట్లలో నివసిస్తున్న పౌరుల సంక్షేమం వంటి రెండు బాధ్యతలనూ విజయవంతంగా నిర్వర్తిస్తున్న ఐడీఈఎస్ అధికారులను రక్షణ మంత్రి అభినందించారు. మరింత సమర్థంగా, పారదర్శకంగా, పౌరులకు అనుకూలంగా సేవలందించేలా వ్యవస్థలు, ప్రక్రియలను నిరంతరం అప్‌గ్రేడ్ చేస్తూ ఆధునిక నగరాలకు దీటుగా కంటోన్మెంట్లను అభివృద్ధి చేయాల్సిన అవసరముందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయ పడ్డారు. "ప్రజలు ఇంటి నుంచే పారదర్శకంగా, సకాలంలో సేవలను పొందగలిగేలా మనం డిజిటల్ సేవలను మెరుగుపరచాలి. కంటోన్మెంట్ల భవిష్యత్తు ప్రణాళికల్లో నివాసితుల భాగస్వామ్యాన్ని పెంచాలి. కాలాను గుణంగా తలెత్తే డిమాండ్లకు అనుగుణంగా సేవలను అందించగల ఆధునిక, పారదర్శక, జవాబుదారీ సంస్థలుగా కంటోన్మెంట్ బోర్డులను మార్చాలి. కంటోన్మెంట్ నివాసితులకు అత్యుత్తమ సదుపాయాలు కల్పించడం, ఫిర్యాదులను త్వరగా పరిష్కరించే యంత్రాంగాన్ని అందుబాటులో ఉంచడం మన సమష్టి బాధ్యత" అని రక్షణ మంత్రి వ్యాఖ్యానించారు.నివాసితుల జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచాల్సిన అవసరముందన్న రక్షణ మంత్రి.. ఏఐ-ఆధారిత ఫిర్యాదుల పరిష్కారం, బహుభాషా సేవలు, స్మార్ట్ హెల్త్‌ను భాగం చేస్తూ ఇ-ఛావనీ 2.0 వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కంటోన్మెంట్లలోని పేదలు, దివ్యాంగులు, వయోవృద్ధులు, బుద్ధిమాంద్యంతో గల పిల్లల సంక్షేమంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. భవిష్యత్ కంటోన్మెంట్లు స్మార్ట్ పవర్ సిస్టమ్‌లు, పునరుత్పాదక ఇంధన గ్రిడ్‌లు, ఈవీ ఛార్జింగ్ హబ్‌లు, స్మార్ట్ వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్లు, ఏఐ-ఆధారిత నిఘా వ్యవస్థలతో స్మార్ట్‌గా అభివృద్ధి చెందాలని రక్షణ మంత్రి ఆకాంక్షించారు.ఐడీఈఎస్, కంటోన్మెంట్ బోర్డుల ఆర్థిక స్వాతంత్ర్యం కోసం మద్దతు పలికిన రక్షణ మంత్రి.. ఈ అంశంపై మేధోమథనం చేయాలనీ, దార్శనికత సాకారం కోసం ఒక ప్రాథమిక ప్రణాళికనూ సిద్ధం చేయాలని కోరారు. ఈ ప్రయత్నంలో ప్రభుత్వ సంపూర్ణ మద్దతు ఉంటుందని భరోసానిచ్చారు.

చిరు వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, అంకురసంస్థలను ప్రోత్సహించడానికి ఇ-కనెక్ట్ వంటి వేదికలను ప్రారంభించడం సహా కంటోన్మెంట్లలో వ్యాపార నిర్వహణ సులభతరం చేయడానికి డీజీడీఈ చేసిన ప్రయత్నాలను శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. పర్యావరణ హితమైన కంటోన్మెంట్ బోర్డుల ఏర్పాటు సంకల్పాన్ని ఆయన అభినందించారు. "పచ్చదనం క్షీణిస్తున్న నేటి సమయంలో అభివృద్ధి-పర్యావరణం కలిసి ఉండవచ్చని కంటోన్మెంట్లు రుజువు చేస్తున్నాయి" అని రక్షణ మంత్రి వ్యాఖ్యానించారు.

సాంకేతిక, ఆవిష్కరణ రంగాల్లో నిరంతర పురోగతిని దృష్టిలో ఉంచుకుని అధికారులు తమ నైపుణ్యాలను, పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని రక్షణ మంత్రి కోరారు. "చేస్తున్న పనిని కేవలం ఉద్యోగంగా పరిగణించకూడదు. ఇది జాతి నిర్మాణానికి ఒక మాధ్యమం. మీ ప్రతిభను, శక్తిని, సమయాన్ని సద్వినియోగం చేసుకోండి. ప్రతిరోజూ మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకోండి. కొత్త నైపుణ్యాలను నేర్చుకోండి. మీరు చేసే ప్రతి ప్రయత్నం దేశాన్ని బలోపేతం చేస్తుంది" అని ఆయన అధికారులకు సూచించారు.వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, రక్షణ శాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్, డైరెక్టర్ జనరల్ డిఫెన్స్ ఎస్టేట్స్ (డీజీడీఈ) శ్రీ శైలేంద్ర నాథ్ గుప్తా, డీజీడీఈగా నియమితులైన శ్రీమతి శోభా గుప్తా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.రక్షణ భూముల నిర్వహణ రంగంలో గత ఏడాది కాలంగా డీజీడీఈ నిర్వహించిన అత్యుత్తమ కార్యక్రమాలు, సాధించిన విజయాలపై ప్రత్యేక ప్రదర్శనలు.. వికసిత్ భారత్ఏ2047 సాధన కోసం వ్యూహాత్మక రోడ్‌మ్యాప్... ప్రారంభ సమావేశంలో ప్రధాన అంశాలుగా ఉన్నాయి. రెండో రోజు సమావేశంలో భూ వనరుల శాఖ కార్యదర్శి శ్రీ మనోజ్ జోషి, భారత అటార్నీ జనరల్ శ్రీ ఆర్ వెంకటరమణి, భారత డిప్యూటీ కంప్ట్రోలర్-ఆడిటర్ జనరల్ శ్రీ సుబీర్ మాలిక్, ఇతర మేధావులు, నిపుణులతో సమావేశాలు నిర్వహిస్తారు.రక్షణ రంగంలో భూముల నిర్వహణ గురించిన కొత్త ఆలోచనలు రూపొందించడం, అధునాతన డిజిటల్ సాధనాలు, సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించడం, పాలనాపరమైన ప్రాథమిక ప్రణాళికలు, సుస్థిరతను బలోపేతం చేయడంలో మెరుగవుతున్న డీజీడీఈ పాత్రపై ఈ సమావేశం దృష్టి సారిస్తోంది. రక్షణ రంగంలో భూ నిర్వహణ భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన అంశాలపై సీనియర్ ప్రభుత్వ అధికారులు, ఈ రంగానికి చెందిన నిపుణుల అభిప్రాయాలు పంచుకునే సమావేశాలు, వారి ప్రసంగాలు దీనిలో భాగంగా ఉంటాయి.

# రాజమండ్రి నుంచి తిరుపతికి విమానం.. దసరాకు ప్రారంభం

అమరావతి, సెప్టెంబర్ 19: రాజమండ్రి వాసులకు గుడ్‌న్యూస్. తిరుపతి వెళ్లే ప్రయాణికులకు కొత్తగా విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. దసరా సందర్భంగా అక్టోబర్ 1వ తేదీ నుంచి సర్వీసులు ప్రారంభించనున్నట్లు అలయన్స్ ఎయిర్ సర్వీస్ సంస్థ తెలిపింది. వారానికి మూడు రోజులు మాత్రమే విమాన సర్వీసు అందుబాటులో ఉంటుందని పేర్కొంది.

వారంలో మంగళ, గురు, శనివారాల్లో రాజమండ్రి నుంచి తిరుపతికి విమానాలు నడవనున్నాయి. రాజమండ్రి నుంచి ఉదయం 9.40 గంటలకు బయల్దేరి 11.20 గంటలకు తిరుపతికి చేరుతుంది. ఇక తిరుపతి నుంచి ఉదయం 7.40 గంటలకు బయల్దేరి ఉదయం 9.25 గంటలకు రాజమండ్రికి చేరనుంది. ఈ మేరకు అలయన్స్ ఎయిర్ సర్వీస్ అధికారులు వివరాలు వెల్లడించారు.

# చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పుస్తక పఠనం..

హైదరాబాద్, సెప్టెంబర్ 19: నిరుద్యోగులకు, గ్రూప్ 1 అభ్యర్థులకు మద్దతుగా చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో బీఆర్ఎస్ సీనియర్ లీడర్, మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పుస్తకాలు చదివారు. కాసేపు లైబ్రరీలో పుస్తక పఠనం చేసిన అనంతరం ఆర్ఎస్పీ అక్కడ్నుంచి వెళ్లిపోయారు.

నిరుద్యోగులకు సంఘీభావంగా, గ్రూప్ 1 అభ్యర్థులకు మద్దతుగా, చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో నిరుద్యోగులతో పాటు పుస్తకాలు చదవడానికి వచ్చిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అడ్డుకున్నారు. తాను రాజకీయాలు చేయడానికి రాలేదు.. నిరుద్యోగ అభ్యర్థులతో కూడా మాట్లాడడానికి రాలేదు. లైబ్రరీలో చదువుకోవడానికి వచ్చాను. చదువుకునేందుకు వస్తే అడ్డుకోవడం ఏంటని పోలీసులపై ఆర్ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను లైబ్రరీలోకి పోలీసులు అనుమతించారు.

# అఫ్గాన్ సార్వభౌమాధికారాన్ని మా దేశం గౌరవిస్తుంది : చైనా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:అఫ్గానిస్థాన్‌లోని బాగ్రాం వైమానిక స్థావరాన్నిమళ్లీ స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. దీనిపై తాజాగా చైనా స్పందించింది. బాగ్రాంలో అమెరికా మళ్లీ పాగా వేసే నిర్ణయాన్ని అఫ్గానిస్థాన్ ప్రజలకు వదిలేయాలని అభిప్రాయపడింది. వారి భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని పేర్కొంది.

'అఫ్గాన్ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాన్ని చైనా గౌరవిస్తుంది. అఫ్గాన్ భవిష్యత్తు అక్కడి ప్రజల చేతుల్లోనే ఉంది. ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచడంవల్ల మద్దతు లభించదు. ప్రాంతీయ స్థిరత్వం కోసం సంబంధిత పక్షాలు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాయని ఆశిస్తున్నాం' అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ పేర్కొన్నారు.

బ్రిటన్ పర్యటనలో భాగంగా ప్రధాని కీర్ స్టార్మర్‌తో భేటీ అనంతరం మాట్లాడిన డొనాల్డ్ ట్రంప్.. అఫ్గానిస్థాన్‌లోని బాగ్రాం వైమానిక స్థావరంలో మళ్లీ పాగా వేయాలని భావిస్తున్నామని చెప్పారు. ప్రత్యర్థి చైనా అణ్వాయుధ తయారీ కేంద్రాలకు అది అతి దగ్గరగా ఉంటుందని, కేవలం గంట వ్యవధిలో వెళ్లవచ్చన్నారు.

# సంపూర్ణ ఆరోగ్య కార్యక్రమాలతో స్వస్థ నారీ, సశక్త పరివార్ అభియాన్‌ను పాటిస్తున్న ఈఎస్ఐసీ ఆసుపత్రులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19:8వ జాతీయ పోషకాహార మాసోత్సవంతో పాటు దేశవ్యాప్తంగా పక్షం రోజుల ఆరోగ్య ప్రచారం – "స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్" ను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్ఎఫ్డబ్ల్యూ) ఈ నెల 17 నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు నిర్వహిస్తోంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 17 సెప్టెంబర్, 2025న 8వ జాతీయ పోషకాహార మాసోత్సవంతో పాటు పక్షం రోజుల ఆరోగ్య ప్రచారం – "స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్" ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) దేశవ్యాప్తంగా 160 ఈఎస్ఐ ఆసుపత్రులలో సంపూర్ణ ఆరోగ్య శిబిరాలను నిర్వహించడం ద్వారా స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ ప్రచారంలో పాల్గొంటోంది.

ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్, హాస్పిటల్, ఫరీదాబాద్

దేశవ్యాప్త స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ ప్రచారం మొదటి రోజున, ఫరీదాబాద్ లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్, ఆసుపత్రి మహిళల ఆరోగ్యం, ముందస్తు జాగ్రత్తలు, సమాజ అవగాహన కల్పిస్తూ అనేక కార్యక్రమాలను నిర్వహించింది. అధ్యాపకులు, వైద్య అధికారులు, సిబ్బంది సమక్షంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ పూజా గోయల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ రోహిత్ ధాకా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందు జాగ్రత్తలు ద్వారా ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడం, పని చేసే మహిళలకు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలను అందించడంపై ఈఎస్ఐసీ నిరంతర నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది.

షాహి ఎక్స్ పోర్ట్, ధృవ్ గ్లోబల్ సంస్థల్లో కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఇక్కడ మహిళలు నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్సిడిలు), క్షయవ్యాధికి సంబంధించి ప్రశ్నావళి ఆధారిత స్క్రీనింగ్ చేయించుకున్నారు. హిమోగ్లోబిన్, బ్లడ్ షుగర్, బీపీ, మధుమేహం, రక్తహీనత, సాధారణ క్యాన్సర్ల నిర్ధారణ కోసం క్లినికల్ పరీక్షలు కూడా నిర్వహించారు. జీవనశైలి రుగ్మతలు, రుతుక్రమ సమయంలో పరిశుభ్రత, వ్యాక్సినేషన్, పోషకాహారం, రక్తహీనత నివారణపై అవగాహన, కౌన్సెలింగ్ సెషన్లు జరిగాయి. నిక్షయ్ మిత్రల నమోదు, క్షయవ్యాధి నివారణ ప్రతిజ్ఞలు కూడా నిర్వహించారు.

స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడానికి ఫరీదాబాద్లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ, హాస్పిటల్లో రక్తదాన శిబిరం కూడా ఏర్పాటు చేశారు. రక్త దాతలను, సింగిల్ డోనర్ ప్లేట్ లెట్ (ఎస్డిపి) దాతలను సత్కరించారు. దాతలకు హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేశారు. సురక్షితమైన రక్త మార్పిడి పద్ధతుల కోసం దాతల రక్తం యూనిట్లకు వైరల్ మార్కర్ల స్క్రీనింగ్ చేశారు. సమాజంలో స్వచ్ఛంద రక్తదాన సంస్కృతిని మరింత ప్రోత్సహించడానికి ఈ శిబిరంలో అవగాహన సెషన్లు కూడా ఏర్పాటు చేశారు.

ఫరీదాబాద్లోని ఈఎస్ఐసీలో క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ కోసం సంపూర్ణ మహిళా ఆరోగ్య శిబిరాన్ని కూడా నిర్వహించారు. మహిళా లబ్ధిదారులు క్షయ, రక్తపోటు, డయాబెటిస్, రక్తహీనత కోసం స్క్రీనింగ్ తో పాటు ప్రసవానికి ముందు పరీక్షలు, పోషకాహార స్క్రీనింగ్, కౌన్సెలింగ్ పొందారు. నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల కోసం ప్రత్యేక పరీక్షలు జరిగాయి. గర్భాశయ క్యాన్సర్‌ను ముందుగా గుర్తించేందుకు పాప్ స్మెర్ పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా, మహిళా సాధికారతకు, కుటుంబాల శ్రేయస్సుకు ముఖ్యమైన సాధనాలుగా ముందస్తు రోగ నిర్ధారణ, నివారణ సంరక్షణ, ఆరోగ్య విద్య ప్రాముఖ్యతను ఈఎస్ఐసీ చాటిచెప్పింది.

ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్, హాస్పిటల్, సనత్‌నగర్, హైదరాబాద్

హైదరాబాద్ సనత్‌నగర్ లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ కొత్తగా నిర్మించిన 200 పడకల ఆసుపత్రి భవనంలో 17 సెప్టెంబర్ 2025న ఇన్ హౌస్ క్యాంప్ సేవలను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా జరుపుకుంటున్న 'స్వస్థ్ నారి, సశక్త్ పరివార్' అభియాన్‌లో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. వ్యాధి నివారణ, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల ద్వారా మహిళలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించడం, కుటుంబాలను శక్తిమంతం చేయడం ఈ ప్రచార కార్యక్రమం లక్ష్యం.

ఈ ప్రారంభోత్సవానికి ఈఎస్ఐసీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ డాక్టర్ సౌరవ్ కుమార్ దత్తా అధ్యక్షత వహించారు. హైదరాబాద్ లోని ఈఎస్ఐసీ ప్రాంతీయ కార్యాలయం రీజినల్ డైరెక్టర్ శ్రీ రాజీవ్ లాల్, ఇతర సీనియర్ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం ఈఎస్ఐసీ సనత్‌నగర్‌లో ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడంలోనూ, బీమా లబ్ధిదారులకు, సమాజానికి మెరుగైన వైద్య సంరక్షణను అందుబాటులోకి తేవడంలోనూ ఒక ప్రధాన సూచికగా నిలుస్తుంది. సమగ్ర శిబిర సేవలతో కూడిన కొత్త 200 పడకల సౌకర్యం, రోగులకు తక్కువ ఖర్చుతో పూర్తి ఆరోగ్య సంరక్షణను అందించాలనే ఈఎస్ఐసీ నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

ప్రచార కార్యక్రమం ప్రణాళికకు అనుగుణంగా క్యాంపస్ లో ఆరోగ్య పరీక్షా శిబిరాలు, రక్తదాన శిబిరాలు, ప్రతిజ్ఞ, స్వచ్ఛతా హి సేవా ప్రతిజ్ఞ, యోగా సెషన్లు, ఫార్మా–కో–విజిలెన్స్ వీక్ వేడుకలతో సహా అనేక కార్యకలాపాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఆరోగ్య అవగాహన, వ్యాధి నివారణ, సమాజ భాగస్వామ్యం పట్ల ఈఎస్ఐసీ సమగ్ర విధానాన్ని ప్రముఖంగా తెలియచేశాయి.

స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కింద రోజంతా జరిగిన కార్యకలాపాలు క్లిష్టమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించడమే కాకుండా జీవనశైలి మార్పు, పోషకాహారం, మహిళల ఆరోగ్య సవాళ్లపై అవగాహన పెంచాయి. జాతీయ ఆరోగ్య ప్రాధాన్యతలకు మద్దతు ఇవ్వడానికి, ఆరోగ్యకరమైన, సాధికార, సుస్థిర సమాజాన్ని నిర్మించడానికి ఈఎస్ఐసీ కట్టుబడి ఉంది.

# రక్తహీనత రాకుండా మహిళలు పోషకాహారాన్ని తీసుకోవాలి

మెదక్, సెప్టెంబర్ 19:మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసం కార్యక్రమాలు జరుగుతాయని మండల ఐసీడీసీ సూపర్‌వైజర్ సంతోషవెల్లడించారు.

ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని టోపీ తండాలో పోషణ మాసం నిర్వహించారు. స్థానికంగా లభించే కూరగాయలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. తాజా ఆకుకూరలు, పండ్లలో అనేక పోషక విలువలు ఉంటాయని అన్నారు. ముఖ్యంగా మహిళలలో రక్తహీనత రాకుండా బలమైన పోషకాహారాన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కేవలం మహిళలకే కాకుండా మగవారికి కూడా పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలని వెల్లడిం చారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలు, గర్భిణీలు, తల్లులు, పంచాయతీ కార్యదర్శి హనుమంతు, ప్రైమరీ స్కూల్ టీచర్, ఆశ, ఇన్‌చార్జి అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలను అంకితభావంతో పరిష్కరించాలి : అదనపు కలెక్టర్



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 19:గ్రామ పరిపాలన అధికారులు అంకితభావంతో పనిచేస్తూ రైతులకు భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అమరేందర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తాలూకా స్థాయి గ్రామ పరిపాలన అధికారుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ముఖ్యంగా గ్రామాల్లో భూ సమస్యలు ఆధికంగా ఉన్నాయని, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కరించి మేలు చేయాలని కోరారు. తెలంగాణలో భూమి విలువ పెరిగిందని దీంతో జీపీఓలకు అనేక సవాళు ఎదురవుతాయని అన్నారు. గ్రామ అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా, చట్టం ప్రకారం జాగ్రత్తగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బస్సిలాల్, తహసీల్దార్ శ్రీనివాసులు, గ్రామ పరిపాలన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం గ్రీజు కూడా పెట్టలేదు.. అందుకే ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయి.. మంత్రి నిమ్మల కీలక వ్యాఖ్యలు



అమరావతి, సెప్టెంబర్ 19:ఏపీని కరవు రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నీటి పారుదలశాఖను ప్రక్షాళన చేసుకుంటూ ముందుకెళ్తున్నానని చెప్పారు. ఏపీ అసెంబ్లీలో జలవనరులపై లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. కృష్ణా జలాలను ఆఖరి మైలు వరకు తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నామని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. 2026 జులై నాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. పోలవరం ఎడమ కాల్వ జలాలు ఈ ఏడాది అనకాపల్లి వరకు తీసుకెళ్లే ప్లాన్‌లో ఉన్నామని నిమ్మల తెలిపారు. ప్రాధాన్య క్రమంలో తొలి ఏడాది ప్రాజెక్టుల నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు ప్రాధాన్యంగా చేపడతా మని అన్నారు. 20–30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పూర్తికి సీఎం ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు లక్షయాలు నిర్దేశించుకుని నీటిపారుదల పనిచేస్తోందని అన్నారు. రూ.వేల కోట్లు వెచ్చించి నిర్మిం చిన ప్రాజెక్టుల నిర్వహణ లేకపోతే నిరుపయోగంగా మారతాయని నిమ్మల అన్నారు. వైసీపీ పాలనలో ప్రాజెక్టుల నిర్వహణ సరిగ్గా లేదని విమర్శించారు. గత ప్రభుత్వం గ్రీజు కూడా పెట్టలేదని.. దీనివల్ల ప్రాజెక్టు లు, గేట్లు కొట్టుకుపోయాయని అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రాజెక్టుల నిర్వహణ కోసం తొలి ఏడాది మూడు విడతల్లో రూ.800 కోట్లు కేటాయించామని తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాలను ఒక్కొక్కటిగా సరిచేస్తున్నామని అన్నారు. ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకున్నా జలవనరుల శాఖకు నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్ల పేరు చెబితే టీడీపీ గుర్తుకొస్తుందని, వైసీపీ పేరు చెబితే ఇసుక, గనులు, మద్యం, భూ మాఫియా గుర్తుకొస్తాయని ఎద్దేవా చేశారు.

# విత్తనోత్పత్తి క్షేత్రాలను సందర్శించిన వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త

కరీంనగర్, సెప్టెంబర్ 19: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని పలు గ్రామాలలో సాగుచేసిన విత్తనోత్పత్తి క్షేత్రాలను వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త శుక్రవారం సందర్శించారు. ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో భాగంగా వానకాలం సాగుకి ప్రతీ గ్రామానికి ముగ్గురు రైతులకు వరి, పెసర విత్తనాలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు వ్యవసాయ శాఖ ద్వారా పంపిణీ చేశారు.

దొంగతుర్తి, బొట్ల వనపర్తి గ్రామాల్లో రైతులు సాగు చేసిన విత్తనోత్పత్తి క్షేత్రాలను తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్ శాస్త్రవేత్త డా. యం. రాజేందర్ ప్రసాద్ సందర్శించారు. ఈ క్షేత్ర సందర్శనలో భాగంగా శాస్త్రవేత్త రైతులకు విత్తనోత్పత్తిలో మెళకువలను వివరించారు. ఎప్పటికప్పుడు సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చు అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్ చార్జి ఏవో భాస్కర్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

# ఏపీలో ప్రధాన దేవాలయాలకు చైర్మన్ల నియామకం.. శ్రీశైలం ఆలయ చైర్మన్‌గా రమేష్ నాయుడు

అమరావతి, సెప్టెంబర్ 19: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ ఆలయాలకు ప్రభుత్వం చైర్మన్లను నియమించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 17 నెలలకు ప్రముఖ ఆలయాలకు నూతన చైర్మన్లను నియమించారు. ముఖ్యంగా శ్రీశైలం మల్లన్న ఆలయ చైర్మన్‌గా రమేష్ నాయుడును ప్రభుత్వం నియమించింది. శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్‌గా కొట్టె సాయిప్రసాద్, కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ చైర్మన్‌గా సురేంద్రబాబు, విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా రాధాకృష్ణను, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా వెంకట్రాజు నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# సురేందర్ గౌడ్ కుటుంబానికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శ

నల్గొండ, సెప్టెంబర్ 19:చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ మాజీ చైర్మన్ బోయపల్లి సురేందర్ గౌడ్, యాదయ్య గౌడ్ కుటుంబాన్ని బీఆర్ఎస్ మునుగోడు ఇన్‌చార్జి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గురువారం పరామర్శించారు.

సురేందర్ గౌడ్ తల్లి, మాజీ సర్పంచ్ సత్తమ్మ ఇటీవల మృతి చెందడంతో దశ దినకర్మలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో చండూరు మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కోడి వెంకన్న, అన్నెపర్తి శేఖర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎంతపు మధుసూదన్ రావు, పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీశ్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి బొడ్డు సతీశ్ గౌడ్, ఉపాధ్యక్షులు కూరపాటి సుదర్శన్, బోయపల్లి అనంత్ కుమార్, కూరుపాటి లక్ష్మయ్య, తేలుకుంట్ల జానయ్య, బోయపల్లి రమేశ్, ఇరిగి రామన్న, బోడ శ్రీకాంత్, దాసరి వెంకటయ్య పాల్గొన్నారు.

# యూరియా కోసం జరిగిన తోపులాటలో గాయపడ్డ మహిళా రైతు మృతి

నల్లగొండ, సెప్టెంబర్ 19 : అడవిదేవులపల్లి మండలం గోన్యతండాకు చెందిన మహిళా రైతు పాతులోతు దస్సి (55) వారం క్రితం రైతు వేదిక వద్ద యూరియా కోసం వరుసలో నిలబడింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో దస్సి కిందపడడంతో కాలు విరిగింది. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స కోసం మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఆమెను నల్లగొండలోని ప్రైవేట్ అస్పత్రికి షిఫ్ట్ చేశారు. గత ఐదు రోజులుగా ఇక్కడ చికిత్స పొందుతుంది.

కాగా దస్సి శుక్రవారం ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురైంది. వైద్యులు ఆమెకు పరీక్షలు నిర్వహిస్తుండగానే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆమె మృతదేహన్ని స్వగ్రామం గోన్యాతండాకు తరలించారు. రేపు ఉదయం అత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దస్సి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని బీఆర్ఎస్ స్థానిక నేతలు హెచ్చరించారు.

# దేశ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన ఉన్నప్పుడే విద్యార్థులు రాణింపు : లక్ష్మీప్రసాద్



నర్సాపూర్, సెప్టెంబర్ 19:ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఆ దేశ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకున్నప్పుడు ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మీప్రసాద్ అన్నారు. కళాశాలలో జపాన్ కల్చర్‌ను ప్రతిబింభిస్తూ ఇమాజిన్ జపాన్ అనే పేయింటింగ్ పోటీని నిర్వహించారు. గ్రాడ్యూయేట్ స్టడీ అబ్రాడ్ సెంటర్, జపనీస్ భాషా విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 67 మంది విద్యార్థులు పాల్గొని జపాన్ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆవిష్కరణలను కాన్వాస్‌పై చిత్రీకరించారు.

ఈ కార్యక్రమానికి సాగా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ యుకియో నాగనో, కురుమే ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీ జపాన్ ప్రత్యేక ప్రొఫెసర్ శుచి టోరి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విష్ణు విద్యాసంస్థల డీన్ డాక్టర్ రాజు ఏడ్ల, జీఎస్ఏసీ నుంచి ప్రణీత, జపనీస్ భాషా ఉపాధ్యాయురాలు లవీనా అరోరా, విభాగాధిపతులు, మేనేజర్ బాపిరాజు, టీఎల్ఎన్ సురేశ్, ఏవోలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్ ఐటీ కళాశాలలో సెప్టెంబర్ 18, 19 తేదిల్లో నిర్వహించిన స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్–2025లో మొత్తం 62 హార్డ్‌వేర్ , 300 సాఫ్ట్‌వేర్‌కు చెందిన వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శించఆరు. ఈ జట్లలో 50 ఉత్తమ జట్లను జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2025లో పాల్గొనే అవకాశం లభించిందని డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ వెల్లడించారు.

# రాష్టస్థాయి కబడ్డీ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థినిల ఎంపిక




కరీంనగర్, సెప్టెంబర్ 19:చిగు రుమామిడి మండలంలోని చిన్న ముల్కనూర్ ఆదర్శ (మోడల్ స్కూల్) పాఠశాలలో పదో తరగతి చదువుతు న్న పీ వర్ష శ్రీ, జీ శివమణి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ హార్జిత్ కౌర్ తెలిపారు.

ఈ నెల 25 నుంచి 28 వరకు నిర్వహించే 35వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఆ విద్యార్థుల పాల్గొంటారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థినిలు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

# ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలి..

## –పీఎస్ హెచ్‌ఎం రాష్ట్ర అధ్యక్షుడు బీ మురళీధర్ గౌడ్



కరీంనగర్, సెప్టెంబర్ 19:జీవో ఎంఎస్ నెంబర్ 25 ను సవరించి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలాల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీ మురళీధర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో సంఘ సభ్యత్వంలో భాగంగా శుక్రవారం మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల అనేది విద్యా వ్యవస్థకు పునాది లాంటిదని ప్రాథమిక విద్యలో ఉపాధ్యాయుల సంఖ్య పెంచినట్లయితే బాల్య దశలో ఉన్న విద్యార్థులు నాణ్యమైన విద్యను అందుతుందని అన్నారు.

ప్రస్తుతం 60 మంది విద్యార్థులకు కేవలం ఇద్దరు టీచర్ల తో బోధన అభ్యసన ప్రక్రియ ఉంటుందని, దీనివల్ల విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి జరగదని తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉంటూ, పాఠశాల పరిపాలనా విధులు మాత్రమే నిర్వహించేందుకు ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ఒక పీఎస్ హెచ్‌ఎంను కేటాయించేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా నాయకులను మండల కమిటీ సభ్యులను సన్మానించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రచ్చ మురళి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు అత్తె రాజారాం, తాళ్లపల్లి రమేష్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోట శ్రవణ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కె మల్లారెడ్డి, రాష్ట్ర సంఘటన కార్యదర్శి నూతి మల్లన్న, రాష్ట్ర లీగల్ అడ్వైజర్ కే మధుసూదన్ రెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి పులి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సంఘటన కార్యదర్శి సముద్రాల ప్రవీణ్ కుమార్, ధర్మారం, కటికనపల్లి, కొత్తూరు హెడ్మాస్టర్లు మల్లారెడ్డి, మోతిలాల్ నాయక్, ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

# దసరాకు ప్రత్యేక బస్సుల పేరుతో అదనంగా ఛార్జీలు వసూలు పై మండిపడ్డ హరీశ్‌రావు

హైదరాబాద్ సెప్టెంబర్ 19 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : దసరాకు ప్రత్యేక బస్సుల పేరుతో అదనంగా 50 శాతం అధికంగా ఛార్జీలు వసూలు చేస్తామని టీజీఎస్ ఆర్టీసీ ప్రకటించడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పండుగలు వస్తే చాలు ఆర్టీసీ బస్సు ఛార్జీలు అడ్డగోలుగా పెంచి ప్రజల నడ్డి విరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతుండటం సిగ్గుచేటు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

పల్లె వెలుగు సహా అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో టికెట్ ధరలు విపరీతంగా పెంచి బతుకమ్మ, దసరా పండుగ సమయంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి ముక్కు పిండి ఛార్జీలు వసూలు చేయ డం దుర్మార్గం అని నిప్పులు చెరిగారు. అదనపు సర్వీసుల పేరిట 50శాతం అదనపు ఛార్జీల దోపిడీ.. ప్రయాణికు లకు పెను భారంగా మారుతున్నది. పండుగ సంబురం లేకుండా చేస్తున్నది అని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచకుండా, రెగ్యులర్‌గా నడిచే బస్సులకే పండుగ స్పెషల్ బోర్డులు తగిలించి చేస్తున్న ఈ దోపిడీ ముమ్మాటికీ ప్రజాపీడనే అవుతుంది. తెలంగాణ ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ సంతోషాన్ని లేకుండా చేయడమేనా ప్రజా పాలన, ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి అని హరీశ్‌రావు నిలదీశారు.

